సోమవారం
06-02-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 225
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23

అక్షరాక్షరం అభ్యుదయం

'జార్జి బుష్'కు అనుమతివ్వం

గ్రీస్ కమ్యూనిస్టుల భారీ ప్రదర్శన

దేశంలోని అతిపెద్ద పోర్టులో యూఎస్ఎస్ 'జార్జ్ డబ్ల్యూ.బుష్' ఎయిర్‌క్రాఫ్ట్ కెరియర్‌ను ఉంచడాన్ని గ్రీస్ ప్రజలు తప్పుపట్టారు. ఇందుకు వీల్లేదని స్పష్టంచేశారు. పిరాయస్‌లో గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ (కేకేఈ) ఆధ్వర్యంలో వేలాది మంది భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు.

2లో

విశాఖలో సీఎం ఇల్లు

- ముమ్మర ఏర్పాట్లలో అధికారులు
- రూ.100 కోట్లకుపైనే ఖర్చు
- సీఎం నివాస సముదాయంగా బే పార్క్?

విశాలాంధ్ర బ్యూరో–విశాఖపట్నం: విశాఖ నగరాన్ని పరిపాలన రాజధానిగా చేసుకుని ఇక్కడి నుంచే రాష్ట్ర వ్యవహారాలు చూసేందుకు ముఖ్యమంత్రి, మంత్రులు, ఉన్నతాధికారులు విశాఖ వచ్చేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. మరో రెండు నెలల్లోనే విశాఖ నుంచి పాలన ప్రారంభం కావచ్చన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ఇటీవల ఢిల్లీలో పారిశ్రామికవేత్తల సదస్సులో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తాను కూడా 'విశాఖపట్నం షిఫ్ట్ అవుతున్నా, మీరు రండి' అని చెప్పడంతో అధికారులు మరింత దూకుడు మొదలుపెట్టారు. ఇందులో భాగంగానే పరిపాలన రాజధానిగా నగరానికి మెరుగులు దిద్దేలా మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ) కసరత్తు చేస్తోంది. వీఎంఆర్‌డీఏ, టూరిజం, జిల్లా అధికారులు అందుకు తగ్గట్టు ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తోంది. త్వరలో విశాఖలో జరగనున్న పెట్టుబడిదారుల సమ్మిట్, జీ20 సదస్సుల పేరుతో అభివృద్ధి పనులు మరింత వేగవంతం చేశారు. అత్యధికంగా బీచ్ రోడ్డు ప్రాంతం పైన, సీఎం నివాస పరిసర ప్రాంతాలపైన అభివృద్ధిని కేంద్రీకృతం చేస్తున్నట్లు తెలుస్తోంది. విమానాశ్రయం మీదుగా నగరంలోకి ప్రవేశించే ముఖ్యమంత్రి, మంత్రులు, ఇతర ప్రముఖుల కోసం ప్రత్యేక రహదారిని కేటాయించాలని భావిస్తోంది. బోయపాలెం వద్ద ఒక విద్యా సంస్థలో సచివాలయాన్ని ఏర్పాటు చేస్తే ఎలా ఉంటుంది అనే కోణంలో చర్చలు సాగుతున్నాయి. విమానాశ్రయం నుంచి ఇక్కడి వరకూ ఎన్ఏడీ, గోపాలపట్నం, సింహాచలం, హనుమంతవాక, మధురవాడ మీదుగా వెళ్లేలా 35 కి.మీ మార్గాన్ని ఎంపిక చేసింది. ఈ మార్గంలో ఎదురయ్యే అడ్డంకుల్ని అధిగమించేలా ప్రణాళిక రచిస్తున్నారు. మరో పక్క ఇటీవల మంత్రి అమర్నాథ్ అధ్వర్యంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో అంతర్గతంగా కీలక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. నగరంలో చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. ఇదివరకే జీవీఎంసీ పరిధిలో వివిధ రకాల పనులు చేసిన కాంట్రాక్టర్లకు రూ.350 కోట్ల మేర బకాయిలున్నాయి. వీటిని త్వరగా చెల్లించి మౌలికవసతుల పనులకు సహకరించాలని వారిని కోరేలా ప్రయత్నాలు జరుగుతున్నాయి. నగరంలో ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా ముఖ్యమంత్రి రాకపోకలు ఉండాలని భావిస్తున్నారు. ప్రతిపాదిత మార్గంలో ప్రస్తుతం

- మిగతా 2 లో

పాకిస్తాన్ మాజీ అధ్యక్షుడు

ముషారఫ్ మృతి

ఇస్లామాబాద్/ దుబాయ్: పాకిస్తాన్ మాజీ అధ్యక్షుడు పర్వేజ్ ముషారఫ్ (79) మృతిచెందారు. కొంత కాలంగా అరుదైన వ్యాధితో బాధపడుతూ దుబాయ్‌లోని అమెరికన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ముషారఫ్ ఆదివారం కన్నుమూశారు. ఆయన మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపినట్లు పాకిస్తాన్ మీడియా పేర్కొంది. ముషారఫ్ 2016 నుంచి దుబాయ్‌లో ఉంటూ అక్కడే చికిత్స పొందుతున్న విషయం విదితమే. ముషారఫ్ అంత్యక్రియలు పాకిస్తాన్‌లో నిర్వహించేందుకు ఆయన కుటుంబం ఏర్పాట్లు చేస్తోంది. దుబాయ్‌లోని నూర్ ఖాన్ వైమానిక స్థావరం నుంచి ప్రత్యేక సైనిక జెట్ విమానంలో ముషారఫ్ భౌతికకాయాన్ని పాకిస్తాన్‌కు తరలించనున్నారు. ఇందుకోసం దుబాయ్‌లోని పాకిస్తాన్ కాన్సులేట్ జనరల్ హస్సన్ అఫ్జల్ ఖాన్ ఎన్‌ఓసీ జారీ చేసినట్లు పాకిస్తాన్ మీడియా పేర్కొంది. అవసరమైన సహాయ సహకారాలు అందజేస్తామని ముషారఫ్ కుటుంబానికి ఖాన్ హామీనిచ్చారని వార్తా నివేదికలు పేర్కొన్నాయి. అయితే ముషారఫ్ మరణించిన వెంటనే పాకిస్తాన్ సైనిక విభాగమైన ఇంటర్-సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్ (ఐఎస్‌పీఆర్) ఒక ప్రకటనలో ఆయన మరణానికి సంతాపాన్ని, కుటుంబానికి సానుభూతిని ప్రకటించింది. ముషారఫ్ 1999 నుంచి 2008 వరకు పాకిస్తాన్ అధికార బాధ్యతలు చేపట్టారు. రాజ్యాంగాన్ని రద్దు చేసినందుకు 2019లో ఆయనకు మరణశిక్ష ఖరారు చేశారు. ముషారఫ్‌కు వ్యతిరేకంగా షరీఫ్ ప్రభుత్వం తీసుకున్న చర్యలన్నీ రాజ్యాంగ విరుద్ధమని లాహోర్ హైకోర్టు 2020లో తీర్పునివ్వడంతో

- మిగతా 2 లో

బెట్టింగ్, రుణ యాప్‌లపై కేంద్రం కొరడా

న్యూఢిల్లీ: దేశంలో అడ్డగోలుగా పుట్టుకొస్తూ ప్రజలను ఆకర్షించి... ఆ తర్వాత వారి మానసిక వేదనకు కారణమవుతున్న రుణ, బెట్టింగ్ యాప్‌లపై కొరడా ఝుళిపించేందుకు కేంద్రం సిద్ధమైంది. ఈ యాప్‌ల ద్వారా చిన్న మొత్తంలో రుణాలు పొందిన సామాన్యులను ఘోరంగా దోపిడీకి, వేధింపులకు గురిచేసి అనేకమంది ఆత్మహత్యలకు దారితీస్తోన్న ఈ దా'రుణ' యాప్‌ల వ్యవహారంపై కేంద్రం కఠిన నిర్ణయం తీసుకుంది. ప్రజల నుంచి వస్తోన్న ఫిర్యాదులను దృష్టిలో ఉంచుకొని చైనాతో సంబంధం ఉన్న 138 బెట్టింగ్ యాప్‌లు, 94 రుణ చెల్లింపుల యాప్‌లను అత్యవసర ప్రాతిపదికన నిషేధించడానికి సిద్ధమైంది. ఈ మేరకు కేంద్ర ఐటీ శాఖకు హోంశాఖ వ్యవహారాల శాఖ నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ యాప్‌లను బ్లాక్ చేసే ప్రక్రియను ఇప్పటికే కేంద్ర ఐటీశాఖ ప్రారంభించినట్టు ప్రభుత్వ ఉన్నత వర్గాలు పేర్కొన్నాయి. ఐటీ చట్టంలోని సెక్షన్ 69 ప్రకారం ఈ యాప్‌లు దేశ సార్వభౌమత్వం, సమగ్రతకు విఘాతం కలిగించేలా ఉన్నాయని నిర్ధారణకు వచ్చిన తర్వాత ఈ

- మిగతా 2 లో

కేంద్ర ఉద్యోగులకు 4శాతం డీఏ పెంపు?

న్యూఢిల్లీ: కోటి మంది ఉద్యోగులు, పింఛనుదారులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పబోతోంది. ప్రస్తుతం అంగీకరించిన ఫార్ములా ప్రకారం కరువు భత్యాన్ని మరో నాలుగు శాతం పెంచబోతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు 38 శాతంగా ఉన్న డీఏను 42 శాతానికి పెంచే అవకాశాలు కనిపిస్తున్నాయి. కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ పరిధిలోని లేబర్ బ్యూరో ప్రతి నెలా పారిశ్రామిక రంగ కార్మికుల కోసం వినియోగదారుల ధరల సూచీని రూపొందిస్తుంది. దీని ఆధారంగా ఉద్యోగులు, పింఛనుదారులకు

- మిగతా 2 లో

కానిస్టేబుల్ ప్రిలిమ్స్ ఫలితాలు విడుదల

దేహదారుఢ్య పరీక్షకు 95,208 మంది

6,100 పోస్టులకు గట్టి పోటీ

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: పోలీస్ కానిస్టేబుల్ ప్రాథమిక పరీక్ష ఫలితాలు ఆదివారం విడుదలయ్యాయి. పోలీసు వెబ్‌సైట్‌లో ఫలితాల వివరాలు పొందుపరించారు. కానిస్టేబుల్ పరీక్షకు రాష్ట్ర వ్యాప్తంగా 4,59,182 మంది అభ్యర్థులు హాజరవ్వగా, వారిలో 95,208 మంది దేహ దారుఢ్య పరీక్షలకు అర్హత సాధించారు. ఈనెల 7 వరకు ఆన్‌లైన్‌లో ఓఎంఆర్ షీట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఏపీ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు తెలిపింది. ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన వారి నుంచి దేహదారుఢ్య పరీక్ష (పీఈటీ) కోసం వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ దరఖాస్తు ఫారం...ఈనెల 13వ తేదీ మధ్యాహ్నం 3 గంటల నుంచి 20వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉండనుంది. ప్రిలిమినరీ రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులంతా

- మిగతా 2 లో

బడ్జెట్ సంపన్న వర్గాలకేనా?

కేంద్ర వైఖరికి నిరసనగా 10న కేంద్ర కార్యాలయాల ఎదుట నిరసనలు

- నిరుద్యోగ యువత, రైతులు, సామాన్యులకు దగా
- ఏటా 2 కోట్ల ఉద్యోగాల హామీ ఏమైంది?
- అదానీకి మోదీ, జగన్ ఊడిగం
- ప్రధాని జాతికి క్షమాపణ చెప్పాలి
- జగనన్న, టిడ్కో ఇళ్లపై నేడు నిరసనలు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: కేంద్ర బడ్జెట్‌లో నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన, రైతులకు సబ్సిడీ, ధరల నియంత్రణ లేకుండా కేవలం సంపన్న వర్గాలకే పెద్దపీట వేయడాన్ని నిరసిస్తూ ఈనెల 10వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల ఎదుట సీపీఐ అధ్వర్యంలో నిరసనలు చేపట్టనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ వెల్లడించారు. సీపీఐ జాతీయ కమిటీ పిలుపులో భాగంగా దేశ వ్యాప్తంగా ఈ నిరసనలు జరుగుతాయన్నారు. విజయవాడ దాసరి భవన్‌లో ఆదివారం రామకృష్ణ విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అదానీకి అప్పనంగా దోచిపెడుతున్నాయని, అన్ని విధాలా ఆయనకు సహకరిస్తున్నాయని మండిపడ్డారు. పార్లమెంటులో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ సామాన్యులను మరింత ఇబ్బంది పెట్టేలా ఉందని, వారిపై ఏ మాత్రమూ కనికరం చూపలేదన్నారు. బడ్జెట్‌లో ప్రధాన సమస్యలపై ప్రస్తావనే లేదని, దేశ వ్యాప్తంగా పెరిగిన ధరలతో సామాన్యులు ఇబ్బందులు పడుతుంటే, వాటి నియంత్రణపై చర్యలు శూన్యమని, వాటిపై స్పందించలేదని తెలిపారు. నాడు ప్రధాని మోదీ రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని ఇచ్చిన హామీలను విస్మరించారన్నారు. ఎరువులపై సబ్సిడీ ఎత్తివేశారని, గిట్టుబాటు ధరలు లేవని ధ్వజమెత్తారు. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామంటూ అధికారంలోకి వచ్చిన ప్రధాని మోదీ ప్రభుత్వం... బడ్జెట్‌లో ఉద్యోగ కల్పనపై

- మిగతా 2 లో

వీసాల నిరీక్షణకు చెక్!

- భారతీయులకు అమెరికా కొత్త నిబంధనలు
- రాయబార కార్యాలయాల్లో వీసా అపాయింట్‌మెంట్లు

న్యూఢిల్లీ: అమెరికా వీసా కోసం భారతీయులు 500 రోజులకుపైగానే ఎదురు చూడాల్సిన పరిస్థితులు ఇకపై ఉండవని అమెరికా పేర్కొంది. వీసా కోసం నిరీక్షణ కాలాన్ని తగ్గించేందుకు భారతీయుల కోసం కొత్త నిబంధనలు ప్రకటించింది. విదేశీ పర్యటనకు వెళ్లే భారతీయులు అక్కడి అమెరికా దౌత్య కార్యాలయాల్లో వీసా అపాయింట్‌మెంట్ పొందవచ్చని భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం వెల్లడించింది. 'మీరు విదేశీ పర్యటనకు వెళుతున్నారా? అక్కడి రాయబారి కార్యాలయం లేదా కాన్సులేట్‌లో వీసా అపాయింట్‌మెంట్ పొందవచ్చు. ఉదాహరణకు బ్యాంకాక్‌లోని యూఎస్ ఎంబసీ బీ1/బీ2 అపాయింట్‌మెంట్ స్లాట్లను భారతీయులకు ఇస్తుంది' అని ట్వీట్ చేసింది. వీసా దరఖాస్తుల పరిశీలనా వ్యవధిని కుదించేందుకు తొలిసారి దరఖాస్తు చేసుకునే వారికి ప్రత్యేకంగా ఇంటర్వ్యూలకు అనుమతివ్వడం, కాన్సులేట్లలో సిబ్బంది సంఖ్యను పెంచడం వంటి చర్యలను తీసుకుంటోంది. వీసా

- మిగతా 2 లో

ఇదీ లోకం!

అబ్‌కీ బార్ కిసాన్ సర్కార్

- దేశ ప్రజల తలరాత మార్చడమే బీఆర్ఎస్ లక్ష్యం
- గెలవాల్సింది నేతలు కాదు... రైతులు, ప్రజలు
- భారత్ పేద దేశం కాదు: కేసీఆర్

విశాలాంధ్ర–హైదరాబాద్: స్వాతంత్ర్యం వచ్చిన తరువాత అనేక ప్రభుత్వాలు వచ్చాయి... పోయాయి... ప్రధానులు వచ్చారు.... పోయారు. కానీ వారిని నమ్ముకుని ఓట్లు వేసిన మన బతుకులు మాత్రం మారలేదని బీఆరెస్ అధినేత, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు అన్నారు. దేశ ప్రజల తలరాతలు మార్చడమే లక్ష్యంగా టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చి మీ ముందుకు వచ్చామని ఆయన తెలిపారు. బీఆర్ఎస్ ఆవిర్భావం తరువాత ఇతర రాష్ట్రాల్లో తొలి బహిరంగ సభను ఆదివారం మహారాష్ట్రలోని నాందేడ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా నాందేడ్ రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న గురుగోవింద్ సింగ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ బహిరంగ సభలో కేసీఆర్ పాల్గొని ప్రసంగించారు. దేశంలో గుణాత్మక మార్పు కోసమే

- మిగతా 2 లో

ఓటర్లు @ 94.50 కోట్లు

- 1951 నుంచి ఆరు రెట్లు పెరిగిన సంఖ్య
- ఓటేయని మూడో వంతు ఓటర్లు
- పోలింగ్ శాతాల మెరుగుదలకు ఈసీఐ కసరత్తు

న్యూఢిల్లీ: భారతదేశ జనాభాతో పాటు ఓటర్ల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. అయితే ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచే విషయంలో మరిన్ని చర్యలు అవసరమవుతున్నాయి. ఓటర్లలో మూడో వంతు పోలింగ్‌కు దూరంగా ఉంటున్న పరిస్థితి నేటికీ కొనసాగుతోంది. 1951 నుంచి నేటి వరకు ఓటర్ల సంఖ్య ఆరు రెట్లు పెరిగి 94.50 కోట్లకు చేరింది. అయితే పట్టణాల్లో ఉండే యువకులు, వలసదారులు అనేక మంది ఓటింగ్‌లో పాల్గొనడం లేదు. గత లోక్‌సభ ఎన్నికల్లో మొత్తం ఓటర్లలో మూడో వంతు పోలింగ్‌కు దూరంగా ఉన్నట్లు భారత ఎన్నికల కమిషన్ డేటా ద్వారా తెలుస్తోంది. 1951లో తొలి సార్వత్రిక ఎన్నికలు జరిగినప్పుడు ఓటర్లు 17.32 కోట్ల మంది ఉంటే 45.67శాతం మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. దశాబ్దాలు గడిచే కొద్దీ ఓటర్ల సంఖ్యలోనూ గణనీయమైన పెంపుదల ఉంది. అదే విధంగా ఓటు హక్కు

- మిగతా 2 లో

ఇజ్రాయిల్‌లో ఆగని నిరసనలు

ఐదో వారం కొనసాగిన ర్యాలీలు - పాల్గొన్న పదివేల మందికిపైగా

టెల్ అవీవ్: ఇజ్రాయిల్‌లో వరుసగా ఐదో వారం నిరసనలు కొనసాగాయి. వేల సంఖ్యలో ప్రజలు రోడ్లపైకొచ్చి ప్రభుత్వ న్యాయ సంస్కరణల ప్రణాళికలను తీవ్రంగా వ్యతిరేకించారు. రాజధాని టెల్ అవివ్ వీధులన్నీ నిరసనకారులతో నిండిపోయాయి. ప్రధాని నెతన్యాహ్యూ తెచ్చే న్యాయ సంస్కరణలు ఆమోదయోగ్యం కాదని నినాదాలు చేశారు. ఇజ్రాయిల్ జెండాలు చేతపట్టి వర్షాన్ని సైతం లెక్కచేయకుండా కదం తొక్కారు. 'కొత్త ప్రభుత్వం ప్రపంచ శాంతికి ప్రమాదకరం', 'నెతన్యాహు నుంచి ఇజ్రాయిల్ ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి' అన్న బ్యానర్లు ప్రదర్శించారు. నెతన్యాహు నేతృత్వంలో ప్రభుత్వం కొత్తగా ఏర్పాటైనప్పటి నుంచి దేశంలో నిరసనలు జరుగుతూనే ఉన్నాయి. దేశవ్యాప్తంగా 20 నగరాల్లో నిరసనలు మిన్నంటాయని, టెల్ అవీవ్ ఒక్కచోటే ర్యాలీలో పది వేల మందికిపైగా నిరసనకారులు పాల్గొన్నారని స్థానిక మీడియా పేర్కొనగా ఈ సంఖ్యను ఇజ్రాయిలీ పోలీసులు అధికారికంగా ధ్రువీకరించలేదు.

'జార్జి బుష్'కు అనుమతివ్వం

గ్రీస్ కమ్యూనిస్టుల భారీ ప్రదర్శన

ఏథెన్స్: దేశంలోని అతిపెద్ద పోర్టులో యూఎస్ఎస్ 'జార్జ్ డబ్ల్యూ.బుష్' ఎయిర్‌క్రాఫ్ట్ కెరియర్‌ను ఉంచడాన్ని గ్రీస్ ప్రజలు తప్పుపట్టారు. ఇందుకు వీల్లేదని స్పష్టంచేశారు. పిరాయస్‌లో గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ (కేకేఈ) ఆధ్వర్యంలో వేలాది మంది భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. 'ప్రజల హంతకులకు నేలగానీ నీరుగానీ ఇవ్వం' గ్రీస్‌ను అమెరికా-నాటో సైనిక స్థావరంగా మార్చనివ్వం' అని పెద్దపెట్టున నినాదాలు చేశారు. ర్యాలీలో కమ్యూనిస్టు నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జార్జ్ డబ్ల్యూ బుష్‌ను నిలిపివుంచిన ప్రాంతానికి దగ్గరలోని పసలిమని వరకు ర్యాలీ సాగింది.

రష్యా నుంచి ఉక్రెయిన్‌కు 116 మంది యుద్ధఖైదీలు

కీవ్: యుద్ధఖైదీలను మార్చుకునే పద్ధతిలో పదుల సంఖ్యలో రష్యా, ఉక్రెయిన్ సైనికులకు ఊరట లభించింది. ఇప్పటివరకు 116 మంది ఉక్రెయిన్‌లోని తమ స్వస్థలాలకు చేరుకున్నట్లు అధ్యక్షుడి కార్యాలయం అధికారి అంద్రీ యర్మాక్ టెలిగ్రామ్ పోస్టులో పేర్కొన్నారు. 64 మంది రష్యా సైనికులు ఉక్రెయిన్ నుంచి విడుదలైనట్లు అక్కడి అధికారిక వార్తాసంస్థ టీఏఎస్ఎస్ వెల్లడించింది. సైనికుల మార్పు విధానం ప్రకారం ఖైదీలకు విముక్తి కల్పించినట్లు పేర్కొంది. ఇద్దరు బ్రిటిషన్ స్వచ్ఛంధ సహాయకుల మృతదేహాలతో పాటు, ఉక్రెయిన్‌లోని ఇంటర్నేషనల్ లీజియన్‌కు చెందిన వలంటీర్ సైనికుడిని రష్యా ఉక్రెయిన్‌కు చేర్చినట్లు యర్మాక్ తెలిపారు. జనవరి ఆరంభమైనప్పుడు మూడు వేల మందికిపైగా ఉక్రెయన్ సైనికులు రష్యా నిర్బంధంలో ఉన్నారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ మధ్యవర్తిత్వం ఫలితంగా యుద్ధ ఖైదీల మార్పిడి జరిగినట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి.

క్వెట్టాలో భారీ పేలుడు... అనేకమందికి గాయాలు

ఇస్లామాబాద్: వరుస పేలుళ్లతో పాకిస్థాన్ ఉలిక్కిపడింది. బలూచిస్థాన్ ప్రావిన్స్‌లోని క్వెట్టా నగరంలో ఆదివారం భారీ పేలుడు సంభవించింది. కట్టుదిట్టమైన భద్రతగల ప్రాంతంలో బాంబు పేలినట్లు పాకిస్తాన్ మీడియా పేర్కొంది. ప్రాణ నష్టం వివరాలు తెలియకపోగా అనేకమంది తీవ్రంగా గాయపడినట్లు తెలిపింది. క్వెట్టా పోలీస్ ప్రధాన కార్యాలయం సమీపంలోని క్వెట్టా కంటోన్మెంట్ ప్రవేశం (ఎఫ్‌సీ మూసా చెక్‌పాయింట్) వద్ద ఉదయం పేలుడు జరుగగా దీనికి సంబంధించిన వీడియోను 'బలూచిస్థాన్ పోస్ట్' ట్వీట్ చేసింది. పెద్ద ఎత్తున పొగ, ధూళి వ్యాపించినట్లు ఈ వీడియోలో కనిపిస్తోంది. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని, సహాయ కార్యకలాపాలు చేపట్టారు. పీఎస్ఎల్ క్రికెట్ మ్యాచ్ నేపథ్యంలో ఈ నగరంలో భద్రతను కట్టుదిట్టం చేశారు. గాయపడిన వారిలో కొందరు ప్రాణాపాయ స్థితిలో ఉన్నారని, క్షతగాత్రులను క్వెట్టాలోని సివిల్ ఆసుపత్రికి తరలించినట్లు అధికారులు చెప్పారు. పోలీసులు, అత్యవసర బృందాలు సహాయక చర్యలు చేపట్టినట్లు మీడియా తెలిపింది.

వాణీజయరాం అంత్యక్రియలు పూర్తి

చెన్నై: సుప్రసిద్ధ సినీ నేపథ్యగాయని వాణి జయరాం (78) మృతిపై ఎలాంటి సందేహం లేదని చెన్నై నగర పోలీసులు స్పష్టం చేశారు. పడక గదిలో కిందపడటం వల్లే ఆమె మృతి చెందారని వారు వెల్లడించారు. బెడ్రూంలో ఆమె కింద పడటంతో తలకు బలమైన గాయం తగలడం వల్లే ప్రాణం పోయిందని ఫోరెన్సిక్ నిపుణులు నివేదిక ఇచ్చారని పోలీసులు తెలిపారు. వాణి జయరాం ఇల్లు ఉండే అపార్టుమెంట్ ప్రాంగణంలో ఉన్న సీసీటీవీ కెమెరాలను పరిశీలించినప్పటికీ ఎక్కడా కూడా అనుమానాస్పద కదలికలు కనిపించలేదన్నారు. వాణి జయరాం మృతి చెందిన ఇంటిని చెన్నై, ట్రిప్లికేణి అసిస్టెంట్ కమిషనర్ దేశ్‌ముఖ్ శేఖర్ సంజయ్‌తో పాటు ఇతర పోలీసు ఉన్నతాధికారులు పరిశీలించారు. అయితే, శవపరీక్ష నివేదిక వచ్చిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామని పోలీసులు వెల్లడించారు.

ప్రభుత్వ లాంఛనాలతో...: వాణి జయరాం అంత్యక్రియలు ఆదివారం మధ్యాహ్నం పూర్తిగా ప్రభుత్వ లాంఛనాలతో ముగిశాయి. చెన్నై బీసెంట్ నగరులో ఉన్న విద్యుత్ దహన వాటికలో ఆమె కుటుంబ సభ్యులు పూర్తిచేశారు. అక్కడ పోలీసులు గాలిలోకి కాల్పులు జరిపి, ఆమెకు నివాళులు అర్పించారు. అంతకుముందు ఆమె భౌతికకాయానికి ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పుష్పగుచ్ఛం ఉంచి నివాళులు అర్పించారు. ఆ తర్వాత విలేకరులతో మాట్లాడుతూ, వాణి జయరాం అంత్యక్రియలను ప్రభుత్వ లాంఛనాలతో పూర్తిచేస్తామన్నారు. పద్మభూషణ్ అవార్డును స్వీకరించకుండానే వెళ్లిపోవడం బాధగా ఉందన్నారు. ఆ తర్వాత వాణి జయరాం అంతిమ యాత్ర నుంగంబాక్కంలోని హాడ్డోస్ లేన్‌లో ఉన్న ఆమె నివాసం నుంచి బీసెంట్ నగరు శ్మశానవాటిక వరకు కొనసాగింది. దారిపొడవున సినీ అభిమానులు ఆమెకు కన్నీటి వీడ్కోలు పలికారు. కాగా, వాణి జయరాం తన పెళ్లి రోజైన ఫిబ్రవరి 4న కన్నుమూశారు. ఈమె 1968, ఫిబ్రవరి 4న జయరాంను పెళ్ళి చేసుకున్న విషయం తెల్సిందే.

ఆమె భర్తను కలుసుకుంటారు: పి.సుశీల

సహచర గాయనీమణి వాణిజయరాం మృతిపై మరో సుప్రసిద్ధ గాయని పి.సుశీల ఆదివారం ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. తమకంటే మంచి గాయనీమణి వాణి అన్నారు. 'ఆమె మరణించిన వార్తను నాకు ఎవరూ చెప్పలేదు. హైదరాబాద్‌లో ఉన్న తన మనవరాలు ఆదివారం ఉదయం ఫోన్ చేసి.. ఒక విషాదకర వార్త.. వాణి జయరాం ఇకలేరు అని చెప్పడంతో షాక్‌కు గురయ్యాను. మా అందరికంటే కూడా మంచి గాయని. ఏక సంతాగ్రహి. ఆమెను నవ్వించడం మాతరమయ్యేది కాదు. నాతో పాటు సినీ ప్రపంచం ఒక మంచి గాయనిని కోల్పోయింది. ఆమె మృతి సంగీత ప్రపంచానికి తీరని లోటు. దేవుడు పిలిచినట్టున్నాడు. ఆమె భర్తను కలుసుకుని కుంటారు' అని సుశీల అన్నారు.

4శాతం డీఏ పెంపు?

(మొదటిపేజీ తరువాయి)

డీఏ నిర్ణయిస్తారు. ఆలిండియా రైల్వేమెన్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి శివ గోపాల్ మిశ్రా ఆదివారం ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ 2022 డిసెంబరు సీపీఐ-ఐడబ్ల్యూ 2023 జనవరి 31న విడుదలైందని చెప్పారు. డీఏ పెంపు 4.23గా ఉండాలని లెక్కలు చెబుతున్నాయన్నారు. అయితే దశాంశ స్థానాల్లో ఉన్నదానిని పెంచేందుకు ప్రభుత్వం అంగీకరించదని తెలిపారు. అందువల్ల డీఏ 4 శాతం పెరగవచ్చునని చెప్పారు. ఆర్థిక మంత్రిత్వ శాఖలోని వ్యయాల శాఖ డీఏ పెంపు ప్రతిపాదనలను సిద్ధం చేసి, ఆ పెంపు వల్ల భరించవలసిన పర్యవసానాలను వివరిస్తుందని, దీనికి సంబంధించిన నివేదికను కేంద్ర కేబినెట్ ఆమోదం కోసం పంపిస్తారన్నారు. డీఏ పెంపుపై నిర్ణయం తీసుకుంటే, ఆ పెంచిన డీఏ 2023 జనవరి 1 నుంచి వర్తిస్తుంది. 2022 సెప్టెంబరు 28న డీఏ సవరణ జరిగింది. అది 2022 జులై 1 నుంచి అమలవుతోంది. అఖిల భారత వినియోగదారుల ధరల సూచీ ఆధారంగా ఈ మదింపు చేశారు. 2022 జూన్‌తో ముగిసిన 12 నెలల నెలవారీ ధరల సగటు ఆధారంగా ఈ డీఏ నిర్ణయించారు. అప్పుడు కూడా నాలుగు శాతమే పెంచారు. పెరిగే ధరల భారానికి పరిహారంగా డీఏను ప్రభుత్వం చెల్లిస్తుంది. కొంతకాలంలో జీవన వ్యయం పెరుగుతూ ఉంటుంది. ఇది సీపీఐ-ఐడబ్ల్యూలో వెల్లడవుతుంది. డీఏను సంవత్సరంలో రెండుసార్లు సవరిస్తారు.

ఓటర్లు @ 94.50కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

వినియోగించుకునే వారి సంఖ్య కూడా పెరిగింది. 1957 సార్వత్రిక ఎన్నికల్లో 19.37 కోట్లు మంది ఓటర్లు ఉండగా 47.74శాతం మంది ఓటేశారు. అయితే ఓటరు శాతాన్ని 75శాతానికి పెంచాలని ఎన్నికల కమిషన్ కసరత్తు చేస్తోంది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో 30 కోట్ల మంది పోలింగ్ బూత్‌లకు వెళ్లలేదని, తమ ఓటు హక్కును వినియోగించుకోలేదని నిర్ధారించింది. పట్టణ ప్రజలు, యువకులు, వలస కార్మికులు ఓటేయని వారిలో ఉన్నట్లు పేర్కొంది. ఇటీవల జరిగిన హిమాచల్ ప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాల్లోని అసెంబ్లీ ఎన్నికల కోసం పట్టణ ప్రజల ఉదాసీన వైఖరిని ఈసీ ప్రధానంగా పేర్కొంది. స్వరాష్ట్రంలో ఓటర్లుగా నమోదైన వారు వివిధ కారణాల రీత్యా వేర్వేరు చోట్లకు వలస వెళ్లిన క్రమంలో ఓటు హక్కును వినియోగించుకునే పరిస్థితి ఉండటం లేదని ఎన్నికల సంఘం గుర్తించింది. దీంతో రిమోట్ ఓటింగ్ సాంకేతికతను ప్రతిపాదించింది. ఇందుకు రాజకీయ ఏకాభిప్రాయంతో పాటు రిమోట్ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు కావాల్సి ఉంది. ఈ ఏడాది కొన్ని రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలతో పాటు వచ్చే ఏడాది లోక్‌సభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఓటరు శాతాన్ని పెంచేందుకు వినూత్నమైన కమ్యూనికేషన్ వ్యూహాలపై ఈసీ పూర్తిగా దృష్టిని కేంద్రీకరించింది. కాగా, 1962 సార్వత్రిక ఎన్నికల్లో 55.42శాతం మంది ఓటు వేయగా 2009లో 71.70శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 2014 సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్ల శాతం 66.44శాతం కాగా మొత్తం 83.40కోట్ల మంది ఓటర్లుగా నమోదై ఉన్నారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో 91.20 కోట్ల మంది ఓటర్లు ఉంటే 67.40శాతం ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రస్తుతానికి నమోదైన ఓటర్ల సంఖ్య 94,50,25,694కు చేరుకుంది.

బడ్జెట్ సంపన్న వర్గాలకేనా?

(మొదటిపేజీ తరువాయి)

ఎలాంటి చర్యలూ తీసుకోలేదన్నారు. నిరుద్యోగులను కేంద్ర ప్రభుత్వం పూర్తిగా దగా చేసిందని, కేవలం కార్పొరేట్ వర్గాల ఆస్తులు పెంచేలా, సంపన్నులకు మేలు కలిగేలా బడ్జెట్ ఉందని విమర్శించారు. 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని, అప్పుల బారి నుంచి, ఆత్మహత్యల నుంచి కాపాడాతమంటూ ఘనంగా చెప్పిన మోదీ... ఈ బడ్జెట్‌లో వారికోసం ఎలాంటి చర్యలు లేవన్నారు. 2023 వచ్చాక కూడా రైతుల సంక్షేమానికి కృషి చేయలేదని, దాదాపు రూ.50 వేల కోట్ల ఎరువుల సబ్సిడీ కోత విధించారని, ప్రతి పండించే రైతులకు గిట్టుబాటు ధర ప్రస్తావనే లేదని, కేంద్రం సామాన్యుల సమస్యలపై మౌనం దాల్చిందని తప్పుపట్టారు. పేదరికం తగ్గింపునకు బడ్జెట్‌లో ప్రస్తావించలేదన్నారు. ఆంధ్ర ప్రదేశ్‌నూ కేంద్రం పదేపదే దగా చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పక్క రాష్ట్రమైన కర్ణాటకలో రానున్న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, అక్కడ నిధులు కేటాయిస్తోందని విమర్శించారు. విభజన హామీలు, ఏపీకి ప్రత్యేక హోదా తదితర అంశాల్లోనూ రాష్ట్రానికి కేంద్రం అడుగడుగునా అన్యాయం చేస్తోందన్నారు. విభజన చట్టంలో ఉన్న విశాఖ రైల్వే జోన్, వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు నిధులు లేవని దుయ్యబట్టారు. విశాఖ రైల్వే జోన్ కోసం రూ.170 కోట్లు కేంద్రం కేటాయించాల్సి ఉండగా గత సంవత్సరం బడ్జెట్‌లో రూ.50 లక్షలు కేటాయించగా ఈ సంవత్సరం బడ్జెట్‌లో రూ.10 కోట్లు కేటాయించారని వివరించారు. ఈ కేటాయింపులతో విశాఖ రైల్వే జోన్ ఏర్పాటెలా సాధ్యమని, అసలు విశాఖ రైల్వే జోన్ ఉన్నట్టా?, లేనట్టా? అని ప్రశ్నించారు. కర్ణాటకలో ఉన్న కరవు ప్రాంతాలు గుర్తుకువచ్చిన కేంద్రానికి ఆంధ్ర ప్రదేశ్‌లోని వెనుకబడిన ప్రాంతాలు గుర్తులేకపోవడం దుర్మార్గమన్నారు. హిండెన్‌బర్గ్ నివేదిక వెల్లడయ్యాక ప్రపంచం అంతా చర్చిస్తుంటే... ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మాత్రం అంతా బాగానే ఉందని, దాని ప్రభావం భారత్‌పై ఏ మాత్రమూ ఉండబోదని చెప్పడం విచాకరమన్నారు. ఎస్‌బీఐ, ఎల్ఐసీ షేర్ల ధరలు తగ్గిపోయినట్లు స్పష్టమవుతోందని, అదానీ కంపెనీలన్నీ దివాలా తీస్తున్నాయని వివరించారు. ఆంధ్రాలో అదానీ కంపెనీకి భూములిచ్చిన రైతులంతా వాటిపై వెనక్కి వస్తున్నారన్నారు. సీఎం జగన్ సైతం పూర్తి స్థాయిలో అదానీ అడుగులకు మడుగులొత్తారని, జగన్ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో అగ్రిమెంట్లు అన్నీ అదానీకే చేశారని ధ్వజమెత్తారు. బలవంతంగా దౌర్జన్యం చేసి కృష్ణపట్నం పోర్టును అదానీకే అప్పగించారని, థర్మల్ ప్రాజెక్టునూ ఆయనకే కట్టబెట్టారని, ప్రభుత్వానికి చెందాల్సిన గంగవరం పోర్టునూ అదానీకే కైవసం చేశారని వివరించారు. అదానీ డేటా సెంటర్ పేరుతో వందల కోట్ల విలువైన 130 ఎకరాల భూములను కట్టబెట్టారని వివరించారు. సోలార్ ఎనర్జీ పేరుతో వేలాది ఎకరాలను అనంతపురం జిల్లాలో ఆయనకే కట్టబెట్టారన్నారు. అదానీ దొంగ కంపెనీలతో మొత్తం ప్రపంచాన్నే మోసగిస్తున్నారని మండిపడ్డారు. నాడు రూ.8 వేల కోట్ల ఆర్థిక ఆరోపణలపై సత్యం రామలింగరాజు జైలుకు వెళ్లారని, అదానీపై మాత్రం లక్షల కోట్ల రూపాయల స్కామ్ బయటపడినా చర్యలు లేవని, ప్రధాని మోదీ ఎందుకు నోరు తెరవడం లేదని ప్రశ్నించారు. ప్రపంచంలోనే మూడేళ్లలో రూ.10 లక్షల కోట్ల ఆస్తిని కూడబెట్టిన వారెవరైనా ఉన్నారా? ఏ కంపెనీ అయినా ఉందా? అని కేంద్రాన్ని నిలదీశారు. అదానీకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిగ్గులేకుండా మద్దతిస్తున్నాయని అన్నారు. భారతదేశం అంటే అదానీ, ప్రధానేనా?, 140 కోట్ల మంది ప్రజానీకం కాదా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో పేదవారికి అన్నీ చేస్తున్నామంటూ చెబుతున్న జగన్... వారికి ఒక గూడు కూడా కట్టి ఇవ్వలేక పోతున్నారని, లక్షా 80 వేల రూపాయలతో లబ్ధిదారులు ఎలా ఇళ్లు కట్టించుకుంటారంటూ ప్రశ్నించారు. ఇసుక, సిమెంట్ ధరలను విపరీతంగా పెంచేశారన్నారు. ట్రాక్టరు ఇసుక రూ.8 వేలకు, లారీ ఇసుక రూ.40 వేలకు పెరిగిందని తెలిపారు. ఇంకా పేదల ఇళ్లు ఎక్కడ కట్టుకుంటారని ప్రశ్నించారు. ఇసుక, సిమెంట్ ఉచితంగా ఇవ్వాలని, ప్రతి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయించాలని డిమాండ్ చేశారు. టిడ్కో ఇళ్లు పూర్తయి పాడైపోతున్నప్పటికీ లబ్ధిదారులకు ఇవ్వకుండా నాశనం చేస్తున్నారని విమర్శించారు. జగనన్న ఇళ్ల సమస్యలతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా కట్టిన వేలాది టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 6న తలపెట్టిన నిరసనకు పార్టీ శ్రేణులు, లబ్ధిదారులు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి.హరినాథ రెడ్డి, విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

విశాఖలో సీఎం ఇల్లు

(మొదటిపేజీ తరువాయి)

ఎన్ఏడీ కూడలిలో ఫ్లైఓవర్ పూర్తయింది. ఎన్ఏడీ నుంచి హనుమంతవాక వరకు బస్సు శీఘ్ర రవాణా వ్యవస్థ (బీఆర్‌టీఎస్) ఉంది. ఇందులో భాగంగా సింహాచలం గోశాల కూడలి నుంచి అడవివరం కూడలి వరకు 2 కి.మీ రహదారి విస్తరణ విషయమై 2007 నుంచి వివాదం నడుస్తోంది. న్యాయపరమైన చిక్కులు ఉండటంతో ముందుకు సాగలేదు. త్వరలో దీనిపై చర్చించే అవకాశాలున్నాయి. అక్కడి గృహాలకు టీడీఆర్ లేదా భూములు ఇవ్వడమా అన్నది యోచిస్తున్నారు. చట్టపరంగా ఓ పరిష్కారానికి రావాలని చూస్తున్నారు.

తెరపైకి అనేక ప్రతిపాదనలు

ప్రస్తుతం అనుకుంటున్న మార్గాన్ని తీర్చిదిద్దడంలో అనేక కీలక ప్రతిపాదనలు తెరమీదకి వస్తున్నాయి. వివాదాస్పద 2 కి.మీ బీఆర్‌టీఎస్ రోడ్డుతో కలిపి గోపాలపట్నంలోని సింహాచలం ఆర్చి నుంచి అడవివరం కూడలి దాకా 6 కి.మీ మేర మౌలిక వసతుల కల్పనకు యోచిస్తున్నారు. పరిహారం, గృహాల తొలగింపు, విస్తరణ, రోడ్లు, కాలువల నిర్మాణానికి రూ.100 కోట్లకు పైగానే ప్రతిపాదించనున్నారు. ఇదే మార్గంలో సింహాచలం ఆర్చి సమీపంలో కొండవాలుకు రక్షణగా గోడ నిర్మించనున్నారు.

సీఎం భద్రతా సిబ్బంది పరిశీలన

ఇటీవల ముఖ్యమంత్రి భద్రతా సిబ్బంది నగరానికి వచ్చి విమానాశ్రయం, సచివాలయం ఏర్పాటు చేయాలనుకుంటున్న ప్రాంతాల మధ్య మార్గాన్ని పరిశీలించారు. మార్గమధ్యలో రోడ్డుకు రెండువైపులా కొన్ని మార్పులు చేయాలని సూచించారు. వీరి సూచనలకు అనుగుణంగా జీవీఎంసీ కార్యాచరణ రూపొందిస్తోంది.

పట్టణ పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీలక్ష్మి వారంలో రెండు రోజులు విశాఖ వచ్చి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

బీచ్‌రోడ్డులో ముఖ్యమంత్రి నివాసం

నగరానికి వచ్చాక ముఖ్యమంత్రి నివాసం ఎక్కడుంటుంది అనే విషయమై కొన్నాళ్లుగా చర్చలు జరుగుతున్నాయి. తాజాగా బీచ్‌రోడ్డులోని ప్రాంతాల్ని పరిశీలిస్తున్నారు. ఈ ప్రాంతంలో 'స్మార్ట్ సిటీ'లో భాగంగా పూర్తయిన కొన్ని కీలక కట్టడాలు ఉన్నాయి. వీటితో పాటు ఓ ఫంక్షన్ హాలునూ, ఓ అతిథి గృహాన్ని పరిశీలిస్తున్నారు.

అయితే బీచ్ రోడ్‌లో ఉన్న బే పార్కును ప్రస్తుతం సీఎం నివాసంగా ఏర్పాటు చేసేందుకు భద్రతాధికారులు, సీఎంఓ కార్యాలయం ముఖ్య అధికారులు భావిస్తున్నట్లు విశ్వాసనీయ సమాచారం ద్వారా తెలిసింది. రుషి కొండపై నిర్మిస్తున్న సీఎం శాశ్వత నివాసానికి నిర్మాణ పనులు పూర్తి కావడానికి మరో ఆరు నెలలు సమయం పట్టే అవకాశం ఉన్నందున ప్రస్తుతానికి బే పార్కు లో సీఎం జగన్ తాత్కాలిక నివాసం ఏర్పాటు చేయాలని ఉత్తరాంధ్ర రీజినల్ కో-ఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి కొంతమంది అధికారులకు తెలియజేసినట్లు సమాచారం. మొత్తానికి విశాఖలో సీఎం రాక హడావిడి ఏర్పాట్లు మొదలయ్యాయి.

అబ్‌కీ బార్ కిసాన్ సర్కార్

(మొదటిపేజీ తరువాయి)

బీఆర్ఎస్ ఏర్పాటు చేశామని దానికి అనుగుణంగా అడుగులు వేస్తామన్నారు. ఛత్రపతి శివాజీ, అంబేద్కర్, పూలే వంటి మహనీయులకు జన్మనిచ్చిన పుణ్యభూమి ఇది అంటూ వ్యాఖ్యానించారు. ప్రస్తుత దేశ రాజకీయాల్లో నాయకుల ఆలోచనల్లో భారీ మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏండ్లు అయిన నేటికి రాష్ట్రాలు నీటివనరుల కోసం జగడం చేయాల్సిన దుస్థికి కారణం ఇంతకాలం పాలించిన పాలకులు కాదా అని ప్రశ్నించారు. నేటికీ చాలా గ్రామాల్లో ప్రజలు తాగేందుకు నీరు కూడా లేక అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా దేశంలో అనేక వనరులు ఉన్న నేటికి రైతాంగానికి కావాల్సిన విద్యుత్‌ను అందించడంలో పాలకులు విఫలం అవుతూనే ఉన్నారని మండిపడ్డారు. ఒకవైపు పండించిన పంటలకు ధరలు రాక ఏటా వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి అంతటికీ కారణం దేశాన్ని పాలించిన పాలకులు కాదా అని నిలదీశారు. అసలు రైతుల ఆత్మహత్యలు ఎందుకు జరుగుతున్నాయో ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్ని కష్టాలు, ఎన్ని కన్నీళ్లు, ఎంతో ఆవేదన ఉంటేనే రైతులు ప్రాణ త్యాగాలకు సిద్ధం అవుతారన్నారు. ఇవన్నీ చూసిన తరువాతనే అబ్‌కీ బార్ కిసాన్ సర్కార్ నినాదంతో బీఆర్ఎస్ ప్రజల ముందుకు వచ్చిందన్నారు. దేశంలో దుస్థితిని చూసిన తర్వాత ఈ స్థితిని మార్చాలని సంకల్పించామని, మా సంకల్పానికి దేశవ్యాప్తంగా భారీ మద్దతు లభిస్తోంది అని కేసీఆర్ స్పష్టం చేశారు. మాది రాజకీయ ఆరాటం కాదని జీవన్మరణ పోరటంగా ఆయన అభివర్ణించారు. దశాబ్దాలుగా మార్పు కోసం ఎదురు చూశాము. కానీ అది ఆశించిన మేర జరగలేదన్నారు. ఇంకా వేచిచూసే పరిస్థితుల్లో లేమని మనల్ని మనమే మార్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఎన్నికల్లో గెలవాల్సింది నేతలు కాదు... ప్రజలు.... రైతులు. భారత్‌లో సమృద్ధిగా వనరులు ఉన్నప్పటికీ ప్రజలు నిత్యం పాలకుల చేతిలో వంచనకు

గురవుతున్నారని మండిపడ్డారు.

తెలంగాణ రైతులే రోల్ మోడల్

సరిగ్గా తొమ్మిదేళ్ల క్రితం తెలంగాణలోనూ ఇంతకంటే దుర్భర పరిస్థితులు ఉండేవని గుర్తు చేశారు. కానీ రైతు సంక్షేమ రాజ్యం కోసం తెలంగాణలో ఎన్నో పథకాలు తీసుకొచ్చామని దీని వల్ల నేడు యావత్తు దేశానికే తెలంగాణ రైతాంగం రోల్ మాడల్‌గా నిలిస్తోందన్నారు. 24 గంటల నాణ్యమైన విద్యుత్‌ను ఉచితంగా అందిస్తున్నామని, రైతులు ఏ కారణంతో మరణించిన 4 రోజుల్లోగా రూ.5 లక్షల చెక్ అందిస్తామని చెప్పారు. రైతు బీమా, రైతుబంధుతో ఆదుకుంటున్నామని, రైతులు పండించిన పంటను మొత్తం ప్రభుత్వమే కొనుగోలు చేస్తోందన్నారు. తెలంగాణలో తీసుకొచ్చిన ఈ పథకాలు మహారాష్ట్రలో ఎందుకు లేవు, దేశవ్యాప్తంగా ఎందుకు లేవని ప్రశ్నించారు. రైతు రాజ్యం వస్తేనే కరువు ప్రాంతాలకు న్యాయం జరుగుతుంది' అని చెప్పుకొచ్చారు.

అవినీతిలో బీజేపీ, కాంగ్రెస్ పోటీ

భారత్ పేద దేశం ఎంతమాత్రమూ కాదని, అమెరికా కంటే ధనవంతమైన దేశమని కేసీఆర్ వెల్లడించారు. దేశంలో ఇంతకాలం పాలించిన బీజేపీ, కాంగ్రెస్ నిత్యం అవినీతిలో కూరుకుపోయాయని ధ్వజమెత్తారు. నిత్యం ఒక్కరి పై ఒక్కరు అవినీతి ఆరోపణలు చేసుకోవడం మనం చూస్తూనే ఉన్నామన్నారు. భారత్‌లో ఉన్నంత సాగుయోగ్యమైన భూమి ఇంకొకటి లేదని కానీ దేశాన్ని 54 ఏళ్లు కాంగ్రెస్, 16 ఏళ్లు బీజేపీ పాలించాయి మరి ఇవి ఏం సాధించాయని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీజేపీలు పరస్పరం అవినీతి ఆరోపణలు చేసుకుంటూ ఉంటాయని ఆరోపించారు. నువ్వు అంత తిన్నావంటే,... నువ్వు ఇంత తిన్నావని... తిట్టుకుంటాయని విమర్శించారు. మాంజాలు, పతంగులు, దైవ ప్రతిమలు,... చివరకు జాతీయ జెండాలు కూడా చైనా నుంచే వస్తున్నాయని పేర్కొన్నారు. దేశమంతటా చైనా బజార్లు ఎందుకు ఉన్నాయని ప్రశ్నించారు. నాందేడ్‌లో ఎన్ని చైనా బజార్లు ఉన్నాయో లెక్కపెట్టారా? అని అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద రిజర్వాయర్ చిన్న దేశంలో ఉందని వివరించారు. ఇంత విశాల భారత్‌లో కనీసం 2,000 టీఎంసీల రిజర్వాయర్ ఎందుకు లేదని పేర్కొన్నారు. రాష్ట్రాల మధ్య జలవివాదాలను పరిష్కరించడం లేదని తెలిపారు. ట్రిబ్యునళ్ల పేరుతో సంవత్సరాల కొద్దీ జలవివాదాలు పెండింగ్‌లో పెడతారని కేసీఆర్ అన్నారు. ట్రిబ్యునళ్ల పేరుతో ప్రాజెక్టులకు అనుమతి ఇవ్వకుండా తిప్పుతారని ఆరోపించారు. చిత్తశుద్ధితో కృషి చేస్తే దేశంలో ప్రతి ఎకరాకు నీళ్లు ఇవ్వొచ్చని స్పష్టం చేశారు. గట్టిగా అనుకుంటే ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు ఇవ్వొచ్చని పేర్కొన్నారు.

నాందేడ్‌లో ఘనస్వాగతం

మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా కేంద్రంలో శ్రీ గురు గోబింద్ సింగ్ ఎయిర్ పోర్ట్‌కు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేరుకున్నాక తెలంగాణ నాయకులు ఘనస్వాగతం పలికారు. అక్కడి నుంచి నేరుగా గురుద్వారాకు బయలుదేరి వెళ్లి అక్కడ ప్రార్థనలు చేసి సభాప్రాంగణమైన నాందేడ్‌లోని సచ్‌ఖండ్‌బోడ్ మైదానంలోని బీఆర్ఎస్ బహిరంగసభకు వచ్చారు. అక్కడ ఆయనకు పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి వెంట ఎమ్మెల్సీ కవిత, బీఆర్ఎస్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్ కూడా ఉన్నారు. సభావేదిక పైకి చేరుకున్న కేసీఆర్ ముందుగా శివాజీ, అంబేద్కర్, పూలే విగ్రహాలకు నివాళులు అర్పించారు. సభ అనంతరం సీఎం కేసీఆర్ సమక్షంలో అనేమంది మరాఠా నేతలు పార్టీలో చేరారు. వీరికి పార్టీ గులాబీ కండువాలు కప్పి కేసీఆర్ పార్టీలోకి ఆహ్వానించారు. మహిళా సర్పంచులకు ఎమ్మెల్సీ కవిత కండువాలను కప్పారు.

ముషారఫ్ మృతి

(మొదటిపేజీ తరువాయి)

మరణశిక్ష రద్దు అయింది. ముషారఫ్ 1943 ఆగస్టు 11న ఢిల్లీలో జన్మించారు. దేశ విభజన తర్వాత ముషారఫ్ కుటుంబం పాకిస్తాన్‌కు తరలిపోయింది. లాహోర్‌లోని ఫార్మన్ క్రిష్టియన్ కాలేజీలో ముషారఫ్ విద్యాభ్యాసం జరిగింది. అనంతరం ఆయన లండన్ వెళ్లి అక్కడి రాయల్ కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ స్టడీస్‌లో శిక్షణ పొందారు. 1961లో పాక్ మిలిటరీ అకాడమీలో చేరారు. 1964లో పాకిస్తాన్ సైన్యంలో విధుల్లోకి వచ్చారు. అప్పటికి ఆయనకు 18ఏళ్లు. 1965, 1971 భారత్-పాక్ యుద్ధాల్లో పాల్గొన్నారు. 1990లో మేజర్ జనరల్ అయ్యారు. అంచెలంచెలుగా ఎదుగుతూ పాక్ సైన్యాధ్యక్షుడి అయ్యారు. ఆపై పాక్ అధ్యక్షుడిగా పగ్గాలు చేపట్టారు. ముషారఫ్ తండ్రి పాకిస్తాన్ విదేశాంగ శాఖలో పనిచేయగా ఆయన తల్లి ఉపాధ్యాయురాలుగా పనిచేశారు.

కానిస్టేబుల్ ప్రిలిమ్స్ ఫలితాలు విడుదల

(మొదటిపేజీ తరువాయి)

ఈ దరఖాస్తు తప్పనిసరిగా పూర్తి చేయాలి. పూర్తి వివరాల కోసం హెల్ప్‌లైన్ నంబర్: 9441450639, 9100203323ను సంప్రదించాలి. మొత్తం 200 మార్కులకు నిర్వహించిన ప్రిలిమ్స్ పరీక్షలో ఓసీలకు 40శాతం, బీసీలకు 35శాతం, ఎస్సీ,ఎస్టీ, మాజీ సైనికులకు 30శాతం మార్కులను కటాఫ్‌గా బోర్డు నిర్ణయించింది. మొత్తం 6,100 కానిస్టేబుల్ పోస్టుల భర్తీ కోసం జనవరి 22వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా 997 పరీక్షా కేంద్రాల్లో ప్రిలిమినరీ పరీక్షను విజయవంతంగా నిర్వహించారు. పోలీస్‌శాఖలో పోలీస్ కానిస్టేబుల్ (సివిల్) (పురుషులు మహిళలు), పోలీస్ కానిస్టేబుల్ (ఏపీఎస్‌పీ) (పురుషులు) పోస్టుల భర్తీకిగాను గతేడాది నవంబరు 28న ప్రకటన జారీజేశారు. ఓసీ అభ్యర్థులకు పేపర్‌లో 40శాతం (200కి 80 మార్కులు), బీసీలకు 35శాతం (200కి 70 మార్కులు), ఎస్సీ,ఎస్టీ, మాజీ సైనికులకు 30శాతం (200కి 60 మార్కులు) అర్హతగా నిర్ధారించారు. పరీక్ష ముగిసిన వెంటనే ప్రిలిమినరీ ఆన్సర్ కీని విడుదల చేయగా, 2261 అభ్యంతరాలు వచ్చాయి. వాటిని నిపుణులు పరిశీలించి అందులో మూడు ప్రశ్నలకు సమాధానాలు మార్చారు. తుది జవాబు కీని siprb.ap.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

వీసాల నిరీక్షణకు చెక్!

(మొదటిపేజీ తరువాయి)

బ్యాక్‌లాగ్‌లను తగ్గించేందుకు జనవరి 21న ఢిల్లీలోని అమెరికా దౌత్య కార్యాలయంతో పాటూ ముంబై, చెన్నై, కోల్‌కతా, హైదరాబాద్ నగరాల్లోని దౌత్య కార్యాలయాలు 'స్పెషల్ సాటర్‌డే ఇంటర్వ్యూ డేస్' పేరిట ప్రత్యేకంగా ఇంటర్వ్యూలు నిర్వహించారు. గతంలో అమెరికా వీసా పొందిన వారికి ఇంటర్వ్యూ రద్దు దరఖాస్తుల పరిశీలనకూ నిరీక్షణ ఎక్కువగానే ఉండేది కానీ ఇప్పుడు దానినీ అమెరికా వేగవంతం చేసింది. భారత్‌లోని అమెరికా మిషన్ రెండు వారాల కిందట బి1/బి2 కోసం అదనంగా 2.50లక్షలకుపైగా అపాయింట్‌మెంట్లు ఇచ్చింది. అమెరికాకు వెళ్లాలంటే వీసా పొందేందుకు చాలా కాలం వేచివుండాలన్న ఆందోళన భారతీయుల్లో ఉండేది. ముఖ్యంగా బి1 (బిజినెస్), బి2(టూరిస్ట్) విభాగాల్లో వీసాల కోసం ఇబ్బంది పడాల్సి వచ్చేది.

బెట్టింగ్, రుణ యాప్‌లపై కేంద్రం కొరడా

(మొదటిపేజీ తరువాయి)

చర్యలకు ఉపక్రమించింది. చైనా వ్యక్తులు ఈ యాప్‌లకు డైరెక్టర్లుగా భారతీయులను నియమించి తమ వ్యూహాలు అమలు చేస్తున్నట్టుగా తెలుస్తోంది. నిరాశకు గురైన వ్యక్తులు ఈ యాప్‌ల ద్వారా రుణాలు తీసుకొనేందుకు ఆకర్షితలవుతున్నారు. ఆ తర్వాత యాప్ నిర్వాహకులు ఏటా దాదాపు 3వేల శాతం మేర వడ్డీ పెంచేస్తున్నారు. రుణం తీసుకున్నవారు ఒకవేళ ఏదైనా పరిస్థితుల వల్ల వడ్డీ చెల్లించలేని పరిస్థితి ఏర్పడితే ఈ యాప్‌లకు చెందిన ప్రతినిధులు వేధింపులకు పాల్పడుతున్నారు. రుణాలు తీసుకున్న వారికి అసభ్యకర సందేశాలు పంపడంతో పాటు వారి ఫోన్‌లో ఉన్న ఫొటోలు తీసుకొని మార్ఫింగ్ చేసి వాటిని బయటపెడతామని బెదిరించడం వంటి కిరాతక చర్యలకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో ఇలాంటి రుణాలు తీసుకున్నవారు లేదా బెట్టింగ్ యాప్‌లలో డబ్బులు పోగొట్టుకొని కొందరు ఆత్మహత్యలకు పాల్పడటంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. తెలంగాణతో పాటు ఒడిశా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలతో పాటు కేంద్ర ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు సైతం ఈ యాప్‌లపై చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని కోరడంతో...రంగంలోకి దిగిన కేంద్ర హోంశాఖ ఆరు నెలల క్రితం 28 చైనా రుణ చెల్లింపు యాప్‌లను విశ్లేషించింది. అయితే, 94 యాప్‌లు ఈ-స్టోర్‌లలో అందుబాటులో ఉన్నాయని, మరికొన్ని థర్డ్-పార్టీ లింక్‌ల ద్వారా పనిచేస్తున్నట్టు గుర్తించింది. 2020 జూన్ నుంచి కేంద్ర ప్రభుత్వం 2 వేలకు పైగా చైనా యాప్‌లపై నిషేధం విధించిన విషయం తెలిసిందే.

మున్సిపల్ ఇంజనీరింగ్ ఉద్యోగుల

వేతనాలు పెంచాలి

ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం ఉద్యోగ, కార్మిక, క్లాప్ వాహన డ్రైవర్ల వేతనాలను ప్రభుత్వం తక్షణమే పెంచాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు డిమాండ్ చేశారు. కార్పొరేషన్, మున్సిపాల్టీలు, పంచాయతీల్లో పనిచేస్తున్న ఇంజనీరింగ్, క్లాప్ వాహన డ్రైవర్ల రాష్ట్ర సదస్సును ఆదివారం మున్సిపల్ వర్కర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆసుల రంగనాయకులు అధ్యక్షతన విజయవాడ గొల్లపూడిలోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఓబులేసు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికులపై నిరంకుశంగా వ్యవహరిస్తోందన్నారు. ఒకే రంగంలో పనిచేస్తున్న పారిశుద్ధ్య, ఇంజనీరింగ్, క్లాప్ కార్మికులను వేరువేరుగా చూడటం సరికాదన్నారు. ఇంజనీరింగ్ కార్మికులకు స్కిల్డ్,సెమీ స్కిల్డ్, అన్ స్కిల్డ్ వేతనాలను ఇంతవరకు ఇవ్వలేదనీ, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇస్తామని గొప్పలు చెప్పుకున్న సీఎం జగన్...

4975 మంది క్లాప్ వాహన డ్రైవర్లకు పనిభద్రత, సకాలంలో వేతనాల చెల్లింపులో తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని ధ్వజమెత్తారు. వారిని విధుల్లోకి తీసుకునేటప్పుడు రూ.18,500 వేతనం ఇస్తామని చెప్పి, రూ.10వేలే ఇస్తున్నారన్నారు. అప్కాస్ ఒప్పంద, పొరుగు సేవల సిబ్బందికి భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చి, క్లాప్ డ్రైవర్ల నియామకం, పర్యవేక్షణ వైసీపీ అనుయాయులకు ఎందుకిచ్చారని ఆయన ప్రశ్నించారు. ఒక్కో వాహనం నిర్వహణకు రూ.55వేలు చెల్లిస్తూ మున్సిపల్ నిధులను కాంట్రాక్టర్ కు కట్టబెట్టడం వెనుక ఎన్ని కోట్ల అవినీతి జరిగిందో సీబీఐ తో విచారించాలన్నారు. నాలుగు నెలలుగా క్లాప్ డ్రైవర్లకు రెడ్డి-కో ఏజెన్సీ వేతనాలు ఇవ్వకపోతే...ఈ సంస్థను రద్దు చేయాల్సిన జగన్ ప్రభుత్వం మెతక వైఖరి వహించడం అనుమానాలకు తావిస్తోందన్నారు. తక్షణమే రెడ్డి-కో కాంట్రాక్టరుపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు న్యాయం జరిగేంత వరకూ వారికి అండగా ఏఐటీయూసీ ఉంటుందన్నారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరుమామిళ్ల సుబ్బరాయుడు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 60వేల మంది మున్సిపల్ రంగంలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగ కార్మికులు గత సమ్మెలో ప్రభుత్వం అంగీకరించిన హామీలను ఇవ్వాలని ఒకవైపు డిమాండ్ చేస్తుంటే, మరో వైపు కొత్తగా ఎఫ్ఆర్ఎస్ తీసుకొచ్చి సమస్యలపై పోరాడుతున్న ఉద్యోగ, కార్మికులపై బెదిరింపులకు పాల్పడుతోందన్నారు. ఈనెల 8న రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ప్రాంతీయ సంచాలకుల కార్యాలయాల ముట్టడిని కార్మిక వర్గం జయప్రదం చేయాలని ఓబులేసు పిలుపునిచ్చారు. సదస్సులో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవ సలహాదారు నెక్కంటి సుబ్బారావు, కార్యనిర్వాహక కార్యదర్శి కె.మల్లేశ్వరరావు, కార్యదర్శి రాజేష్‌గౌడ్, సమితి సభ్యులు తారక రామారావు, బాలిరెడ్డి పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక: మున్సిపల్ ఇంజినీరింగ్, ఉద్యోగ, కార్మిక, క్లాప్ డ్రైవర్ల సంఘం నూతన కార్యవర్గం ఎన్నికైంది. రాష్ట్ర కన్వీనర్‌గా పొడుగు రామకృష్ణ (విజయ నగరం), కో-కన్వీనర్లుగా అబ్బాస్(డోన్), చిలకాల రాజ కుమార్ (భీమవరం), గిరిబాబు(చిత్తూరు), కిరణ్ (ప్రకాశం), అప్పలరాజు (ఏలూరు), అనిల్‌కుమార్ (కోనసీమ), మల్లికార్జున (కడప) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఎమ్మెల్సీ తలశిల రఘురామ్‌కు సతీ వియోగం

సీఎం జగన్ నివాళి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కార్యక్రమాల అమలు కమిటీ సమన్వయకర్త, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్ సతీమణి తలశిల స్వర్ణకుమారి అనారోగ్యంతో మృతి చెందారు. సీఎం జగన్, భారతి దంపతులు ఆదివారం విజయవాడ గొల్లపూడిలోని ఎమ్మెల్సీ తలశిల రఘురామ్ నివాసానికి వెళ్లి ఆమె భౌతిక కాయానికి పూలమాలలేసి నివాళులర్పించారు. రఘురామ్‌తో పాటు ఆయన కుటుంబసభ్యులను వారు పరామర్శించారు.

గవర్నర్ సంతాపం

ఎమ్మెల్సీ తలశిల రఘురామ్ సతీమణి తలశిల స్వర్ణ కుమారి ఆకస్మిక మృతికి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ విశ్వభూషన్ హరిచందన్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. చిన్న వయసులోనే స్వర్ణ కుమారి మృతి చెందడం ఆ కుటుంబ సభ్యులకు తీరని లోటన్నారు. రఘురామ్ ఈ బాధను అధిగమించాలంటూ తన సానుభూతిని వ్యక్తపరిచారు.

జలవిద్యుత్ ప్రాజెక్టుకు వ్యతిరేకం

పీసీసీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు

విశాలాంధ్ర-చింతపల్లి : విశాఖ జిల్లా చింతపల్లి మండలం ఎర్రవరం గ్రామంలో ప్రభుత్వం చేపట్టబోతున్న హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణానికి తమ పార్టీ వ్యతిరేకమని, ఎంపీల ద్వారా పార్లమెంటులో ఈ అంశాన్ని లేవనెత్తుతామని ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు అన్నారు. భారత్ జోడో యాత్రకు సంఘీభావంగా ముందుగా పెంటపాడు గ్రామం నుంచి చింతపల్లి వరకు సుమారు 5 కిలోమీటర్ల భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరన్న పడాల్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన బహిరంగ సభను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ మన్యంలో పంచాయతీ తీర్మానం, పీసా, గిరిజన చట్టాలను అతిక్రమించి ప్రభుత్వం అక్రమ మైనింగ్, హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణం చేపడుతుందని, దీనిపై కాంగ్రెస్ పార్టీ ఉద్యమం చేపడుతుందన్నారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం వలంటరీ వ్యవస్థను తీసుకువచ్చి స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసి వాటికి విలువ లేకుండా చేసిందని తెలిపారు. ముఖ్యమంత్రి వద్ద సెక్రటేరియట్‌లో పని చేస్తున్న ఉద్యోగులు గవర్నర్‌ను కలిసి వేతనాలు, పింఛన్లు సకాలంలో అందడం లేదని, తమకు భద్రత కల్పించాలని వినతిపత్రం అందించడం చూస్తే ఈ ప్రభుత్వం పరిస్థితి ఎలా ఉందో ప్రజలు ఆలోచన చెయ్యాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పది లక్షల కోట్ల రూపాయల ఆర్థిక లోటులో ఉందని, పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో నియంతృత్వ, నిరంకుశ పరిపాలన కొనసాగుతోందని, సొంత పార్టీలో ఎమ్మెల్యేలకూ రక్షణ లేదని, వారి ఫోన్లు ట్యాపింగ్ అవుతున్నాయని చెప్పే పరిస్థితి నెలకొందన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ గిరిజనులకు ఉపాధి హామీ పథకం, రుణాల రద్దు తదితర పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. కాంగ్రెస్ ప్రవేశపెట్టిన పథకాలను ఒకసారి ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకోవలసిన అవసరం ఉందని అన్నారు. 2024లో రాహుల్ గాంధీ ప్రధాని కావడం ఖాయం అన్నారు మన్యంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని, త్వరలో పార్టీ గిరిజన ఎంపీలతో కలసి మరోసారి పర్యటిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ ఎస్టీ సెల్ అధ్యక్షులు కొప్పుల రాజు, ఏపీ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాకేష్ రెడ్డి, రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షురాలు శాంతకుమారి, జిల్లా అధ్యక్షుడు వంతల సుబ్బారావు, రుత్తల కృష్ణ, గొంప గోవిందు, కిముడు దేవి, శ్రీనివాసరావు, కృష్ణ పడాల్, చిరంజీవి, బాలరాజు, గురుమూర్తి, సూరిబాబు, రమణ, ఎల్లారావు, గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

వివేకా కేసులో త్వరలో నిజానిజాలు

- తెలంగాణలో విచారణ జరపడం మంచిదే
- సీఎం జగన్ తలచుకుంటే విచారణ 10 రోజుల విషయమే: అప్రూవర్ దస్తగిరి

విశాలాంధ్ర-కడప బ్యూరో: మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసుకు సంబంధించి అనేక ప్రశ్నలకు జవాబు దొరికే సమయం త్వరలోనే ఉందని, సీబీఐ అధికారులు నిజానిజాలు తేలుస్తారని వివేకా హత్య కేసులో అప్రూవర్‌గా మారిన డ్రైవర్ దస్తగిరి తెలిపారు. సీబీఐ అధికారులు జారీ చేసిన సమన్ల మేరకు ఈ నెల 10న హైదరాబాద్‌లో విచారణకు హాజరవుతానని, అన్ని ప్రశ్నలకు సమాధానాలు చెబుతానని అన్నారు. సాక్ష్యాలు లేనిదే ఎవరినీ విచారణ చేయరన్నారు. ఆదివారం దస్తగిరి కడప సెంట్రల్ జైలు గెస్ట్ హౌస్‌లోని సీబీఐ క్యాంపు కార్యాలయంలో సీబీఐ అధికారులను కలిశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కచ్చితంగా, వాటెండ్‌గా విచారణ జరపాలంటే 10 రోజుల విషయమేనన్నారు. కానీ ఆయన అలా చేయకపోవడం వల్లే తెలంగాణకు కేసు పోయిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కచ్చితంగా న్యాయం జరుగుతుందనేది అందరి ఆలోచన, అభిప్రాయం కూడా అని తెలిపారు. అదే వైఖరిపై ఉంటారా అని ప్రశ్నించగా, అదే వైఖరిపై ఉంటానని, పక్కకు ఎందుకు పోతాన న్నారు. సీబీఐ అధికారులు తనను... నిన్ను ఎవరైనా బెదిరించారా, మాట్లాడారా లేదా నీ జోలికి వచ్చారా అని అడిగారన్నారు. గతంలో పోలీసులు తప్పుడు కేసులు పెట్టారని, ప్రాణహాని ఉందని ప్రకటించారని, ఈ విషయమై సీబీఐ వారికి ఏమైనా చెప్పారా, చర్చించారా అని ఒక విలేకరి ప్రశ్నించగా, అప్పుడే చెప్పానని, ఇప్పుడు కొత్తగా చెప్పేది ఏముందన్నారు. ఇటీవల ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డికి నోటీసులు పోతాయనగానే తాను తిరిగే స్కార్పియో వాహనాన్ని ఫైనాన్స్ వారు సీజ్ చేశారన్నారు. ఎందుకు సీజ్ చేశారో తెలియదని, వాయిదాలు కడుతున్నప్పటికీ కావాలనే సీజ్ చేశారని, తాను ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. ఈ విషయం సీబీఐ అధికారులకు వివరించానని, త్వరలో పరిష్కరిస్తామని వారు చెప్పారన్నారు. కాగా ఈ కేసులో కొంత మంది అప్రూవర్‌గా మారే అవకాశం ఉందన్న విషయమై విలేకరులు ప్రశ్నించగా, మారితే మంచిదే కదా, నిజానిజాలు బయట పెట్టి మారమనండి. ఎవరు వద్దన్నారు. నిజం అనేది బయటకు రావాలని రాష్ట్రమంతా కోరుకుంటున్నారన్నారు. తాను చెప్పేది అబద్ధాలని, వాంగ్మూలం అబద్ధమని చెబుతున్నారని తెలిపారు. అయితే సీబీఐ నిజానిజాలు తేల్చినప్పుడు వారు తలకాయలు ఎక్కడ పెట్టుకుంటారో అర్థం అవుతుందని అన్నారు.

బీజాపూర్ జిల్లాలో బీజేపీ నాయకుడి దారుణ హత్య?

విశాలాంధ్ర-చింతూరు: చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో మావోయి స్టులు బీజేపీ నాయకుడ్ని పట్టపగలు అత్యంత పాశవికంగా హత్య చేశారు. ఆవపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని పెకారం గ్రామంలో బీజేపీ నాయకుడు కక్కెం నీలకంఠ (55) ఈ ఘటన చోటు చేసుకుంది. స్వగ్రామమైన పేకారాంలో ఓ వివాహానికి నీలకంఠ హాజరై తిరిగి వస్తున్న సమయంలో పొంచి ఉన్న మావోయిస్టులు కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువుల కళ్ల ముందే కత్తులు, గొడ్డళ్లతో తల నరికేసి హతమార్చారు. ఘటన జరిగిన స్థలంలో నక్సలైట్లు తామే ఈ హత్య చేసినట్లుగా కరపత్రాల్లో రాసి విసిరి వెళ్లినట్లుగా పోలీసులు గుర్తించారు. నీలకంఠ 15ఏళ్లుగా వుసుర్ మండల అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. గతంలో మావోస్టులు నీలకంఠ ను చంపుతామని బెదిరించినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

సీపీఎస్ రద్దుకు సంకల్ప దీక్ష

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ యూటీఎఫ్ అధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం ఉద్యోగులు సంకల్పదీక్ష నిర్వహించారు. సీపీఎస్‌కు బదులుగా గ్యారెంటీ పెన్షన్ స్కీమ్ (జీపీఎస్) తీసుకొస్తామనే ప్రభుత్వం ఆలోచన విరమించాలంటూ నినదించారు. విజయవాడ యూటీఎఫ్ కేంద్ర కార్యాలయ దగ్గర యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వరరావు అధ్వర్యంలో ఉపాధ్యాయులు దీక్షలు చేపట్టారు. పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రం చర్చి వద్ద సంకల్ప దీక్ష నిర్వహించారు. కడప కలెక్టరేట్ ఎదుట నిరసనలో యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మీరాజా అధ్వర్యంలో దీక్షలు నిర్వహించారు. నెల్లూరు యూటీఎఫ్ కార్యాలయం తదితర జిల్లాల్లో దీక్షలు కొనసాగాయి. సీపీఎస్ రద్దుతోపాటు ఉపాధ్యాయుల అన్ని సమస్యల్ని పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఆశామాలవ్యకు గవర్నరు అభినందన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ద్విచక్ర వాహనం (సైకిల్)పై దేశాన్ని చుట్టివస్తున్న అశామాలవ్యకు గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ అభినందించారు. మధ్యప్రదేశ్‌లోని రాజ్‌ఘర్ జిల్లా నతారామ్ గ్రామానికి చెందిన మాలవ్య వివిధ రాష్ట్రాలలో సైకిల్‌పై పర్యటిస్తూ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో ముందుకు సాగుతున్నారు. ద్విచక్ర వాహనంపై దేశంలోని 28 రాష్ట్రాల్లో 25వేల కిలోమీటర్లు తిరగాలన్న లక్ష్యంతో యాత్ర చేపట్టిన మాలవ్య...ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఎనిమిది రాష్ట్రాలలో 8,555కిలోమీటర్ల సైకిలింగ్‌ను పూర్తి చేయడాన్ని గవర్నర్ ప్రశంసించారు. ఉన్నతమైన నినాదాన్ని దేశవ్యాప్తంగా పరిచయం చేస్తున్న మాలవ్య అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని అభిలషించారు. చిన్న వయసులో సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాన్ని ఎంచుకుని దేశాన్ని చుట్టివచ్చే ప్రయత్నం చేయటం గొప్పవిషయని తెలిపారు. జాతీయ క్రీడాకారిణిగా, పర్వతారోహకురాలిగా కూడా అందరికీ తెలిసిన మాలవ్య... మహిళా భద్రత, మహిళా సాధికారత నినాదాన్ని సమాజంలోకి తీసుకెళ్లాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ఎంచుకున్నారు.

కక్ష సాధింపుతోనే గన్‌మెన్ల తగ్గింపు: కోటంరెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు: కక్ష సాధింపుతోనే ప్రభుత్వం తన భద్రతను తగ్గించిందని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఆరోపించారు. ఆదివారం నెల్లూరులోని ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల -సమావేశంలో మాట్లాడుతూ... ప్రభుత్వం కక్ష సాధింపులో భాగంగా తనకున్న నలుగురు గన్‌మెన్‌లలో ఇద్దరిని వెనక్కు తీసుకుందని చెప్పారు. 'నా ఫోన్ ట్యాపింగ్ జరిగిందని చెబితే కక్షసాధింపు చర్యలు చేస్తున్నారు... నాకు బెదిరింపులు వస్తున్న నేపథ్యంలో భద్రతను మరింత కల్పించాల్సింది పోయి ఉన్న భద్రతను తొలగించారు. గన్ మెన్లను తగ్గించడం నాకు ప్రభుత్వం ఇచ్చిన గిఫ్ట్. నేను కూడా ప్రభుత్వానికి రిటర్న్ గిఫ్ట్ ఇస్తున్నాను. నాకు కేటాయించిన మరో ఇద్దరు గన్‌మెన్‌లు కూడా నాకు అవసరం లేదు. ప్రభుత్వానికి వారిని సరెండర్ చేస్తున్నాను. గన్ మెన్ విషయంలో నెల్లూరు ఏఎస్పీ అబద్ధాలు చెబుతున్నారు. నాకు ఇప్పటివరకు 2×2 నలుగురు గన్‌మెన్‌లు ఉంటే వారిలో ఇద్దరిని తొలగించారు. ఏకే47ఉన్న వ్యక్తిని తొలగించారు. సినిమా డైలాగు అనుకోవద్దు. నేను మాత్రం తగ్గేదే లేదు. మరింత కసితో ఇంకా ముందుకు పోతాను' అని అన్నారు. తనను కార్యకర్తలు, అభిమానులే కాపాడుకుంటారని కోటంరెడ్డి అన్నారు.

ఏపీలో అదనంగా 2,550 మెడికల్ సీట్లు: విజయసాయి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో వరుసగా మూడేళ్లలో అదనంగా 2,550 మెడికల్ సీట్లు అందుబాటులోకి రావడంతో వైద్య విద్యలో విస్తృత అవకాశాలు ఏర్పడనున్నట్లు వైసీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి చెప్పారు. ఈ మేరకు సోషల్ మీడియాలో ఆదివారం ఆయన వివిధ అంశాలపై ఆయన స్పందించారు. రాష్ట్రంలో 17నూతన వైద్య కళాశాలల ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.8480కోట్ల వ్యయం చేస్తోందన్నారు. 2023-24 విద్యా సంవత్సరంలో ఐదు వైద్య కళాశాలల్లో అడ్మిషన్లు ప్రారంభం కానున్నాయని వెల్లడించారు.అన్నిటికంటే విద్యాభివృద్ధికే జగన్ ప్రభుత్వం ఎక్కువ నిధులను కేటాయిస్తోందన్నారు. జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం టాప్-200విదేశీ విశ్వవిద్యాలయాల్లో సీట్లు తెచ్చుకున్న విద్యార్థులకు బాసటగా నిలుస్తుందన్నారు.

బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం

- ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల హామీ ఏమైంది?
- నిధులు కేటాయించకుండా అన్యాయం చేసిన బీజేపీ
- దమ్ముంటే నిధుల కోసం పోరాడండి
- జీవీఎల్‌కు ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ డిమాండ్

విశాలాంధ్ర-విశాఖ: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్‌లో ఆంధ్ర ప్రదేశ్‌కు తీవ్ర అన్యాయం జరిగిందని, అధికార, ప్రతిపక్ష ఎంపీలు పార్లమెంటులో పోరాడి నిధులు కేటాయించడం కోసం కృషి చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.లెనిన్ బాబు డిమాండ్ చేశారు. సీపీఐ విశాఖ జిల్లా కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన జరిగి 8 సంవత్సరాలు పూర్తయినా ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయకుండా ఆంధ్ర ప్రదేశ్‌ను మరోసారి మోసం చేశారని, వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాల అభివృద్ధికి, కడప ఉక్కు ఫ్యాక్టరీ, పోలవరం ప్రాజెక్టు నిర్మాణ కోసం ఒక్క పైసా కూడా నిధులు విడుదల చేయకపోవడం సిగ్గుచేటని అన్నారు. విశాఖ రైల్వే జోన్‌కు రూ.10 కోట్లు కేటాయించి గొప్పగా చెప్పుకోవడాన్ని ఖండించారు. అనేక ప్యాసింజర్ రైళ్లను రద్దు చేసి, ఒక్క వందే భారత్ రైలు ఇవ్వడం, అదే అభివృద్ధిగా బీజేపీ నాయకులు చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. బీజేపీ నాయకులు, రాజ్యసభ సభ్యులు జీవీఎల్ నరసింహారావుకు దమ్ముంటే కేంద్రం పై పోరాడి ఆంధ్ర ప్రదేశ్‌కు నిధులు సాధించాలని కోరారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటీకరణ చేయకుండా సొంత గనులు కేటాయించడానికి బీజేపీ ఎందుకు కృషి చేయడం లేదని జీవీఎల్‌ని సూటిగా ప్రశ్నించారు.

విద్యారంగానికి కేవలం 2 శాతం నిధులు

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వి.జాన్సన్ బాబు మాట్లాడుతూ విద్యారంగానికి కేంద్ర బడ్జెట్‌లో 10 శాతం నిధులు కేటాయించి, అభివృద్ధి చేయాలని అనేక కమిషన్లు చెప్పినా, వాటిని పట్టించుకోకుండా కేవలం రెండు శాతం నిధులు కేటాయించడాన్ని తీవ్రంగా ఖండించారు. కొఠారి కమిషన్ సిఫారసులు మేరకు కేంద్రం బడ్జెట్‌లో 10 శాతం, రాష్ట్ర బడ్జెట్‌లో 30 శాతం నిధులు కేటాయించాలని, దాన్ని ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో సుమారు 11 కేంద్రీయ వైద్య విద్యాసంస్థల ఏర్పాటుకు నిధులు కేటాయించకుండా ఆంధ్ర ప్రదేశ్‌కు అన్యాయం చేస్తారా అని ప్రశ్నించారు. బడ్జెట్ కేటాయింపుల్లో తెలుగు రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం చేస్తూ పక్కన ఉన్న కర్ణాటకకు 5,300 కోట్ల రూపాయలు ఎలా కేటాయిస్తారని, ఎన్నికల రాజకీయాలు మానుకొని దేశంలో ప్రతి రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కృషి చేయాలని డిమాండ్ చేశారు. కాగా 411 ఎస్సై పోస్టులకు ప్రిలిమ్స్ ఎగ్జామ్స్ జరుగుతున్న నేపథ్యంలో అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) అధ్వర్యంలో మోడల్ నమూనా పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 19న నిరుద్యోగులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో ఏఐవైఎఫ్ విశాఖ జిల్లా కన్వీనర్ వై.రాంబాబు, కోకన్వీనర్ ఎన్.మధురెడ్డి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.నాగభూషణం విశాఖ జిల్లా కార్యదర్శి యు.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

టీవీ గీసిన చిత్రం వైవిధ్యభరితం

మండలి బుద్ధప్రసాద్

విజయవాడ: టీవీ (టి.వెంకట్రావు) జీవితమే ఒక వర్ణచిత్రమని, 60ఏళ్ల చిత్రకళా జీవితసారమనీ శాసనసభ మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ అభివర్ణించారు. క్రియేటివ్ ఆర్ట్ అకాడమీ, ట్యాస్ సంయుక్తంగా మొగల్రాపురంలోని కల్చరల్ సెంటర్ ఆఫ్ విజయవాడ &అమరావతిలో ఏర్పాటు చేసిన టీవీ చిత్రకళా ప్రదర్శనను ఆదివారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బుద్ధప్రసాద్ మాట్లాడుతూ... టీవీ ఒక కార్టూనిస్టుగానే కాక, కమ్యూనిస్టుగా, వైవిధ్యభరిత వర్ణచిత్రకారునిగా సమాజంలోని లోటుపాట్లను ఎత్తిచూపుతూ సందేశాత్మక చిత్రాలను మనకందించారని కొనియాడారు. ఆ తర్వాత టీవీని ఘనంగా సత్కరించారు. గౌరవ అతిథిగా కార్యక్రమానికి హాజరైన అంతర్జాతీయ చిత్రకారులు పద్మశ్రీ ఎస్వీ రామారావు మాట్లాడుతూ... టీవీ ఒక నడిచే చిత్రకళా ప్రదర్శనశాల అని అభివర్ణించారు. అంతర్జాతీయ కార్టూనిస్టుగా అవార్డు అందుకున్నప్పటికీ సామాన్య మానవుడే తన చిత్రకళా నాయకుడన్నారు. ప్రముఖ చిత్రకారులు జీవై గిరి మాట్లాడుతూ... టీవీ చిత్రాల్లోని సామాజిక, రాజకీయ సందేశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో నగర చిత్రకారులు సన్నాల, కళాసాగర్, ట్యాస్ ప్రతినిధి, చిత్రకారుడు బాలయోగి, అశీర్వాదం, కృష్ణ రంగుల సంధ్య ఇంకా చిత్రకళాభిమానులు పాల్గొన్నారు. టీవీ గీసిన చిత్రాలు తమనెంతో ఆకట్టుకున్నాయని ఔత్సాహిక చిత్రకారులు, చిత్రకళా విద్యార్థులు అభిప్రాయపడ్డారు.

మహిళలు సమర్థ నేతలు కావాలి

- విశాఖలో 'జెండర్ రెస్పాన్సివ్ గవర్నెన్స్' వర్క్‌షాపులో వక్తలు
- పాల్గొన్న ఎనిమిది రాష్ట్రాల మహిళా ఎమ్మెల్యేలు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: మహిళలు సమర్థ నాయకులు కావాలని, ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన వారిలో నాయకత్వ లక్షణాలను మరింతగా పెంపొందించే ఉద్దేశంతో విశాఖలో జరిగే 'జెండర్ రెస్పాన్సివ్ గవర్నెన్స్' వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు వక్తలు తెలిపారు. పోర్టు నగరం విశాఖపట్నం మహిళా సాధికారత సదస్సుకు వేదికైంది. జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సీడబ్ల్యూ), నేషనల్ జెండర్ అండ్ చైల్డ్ సెంటర్ (ఎన్‌జీ & సీసీ), లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ (ఎల్‌బీఎస్ ఎన్ఏఏ) సంయుక్త అధ్వర్యంలో 'షీ ఈజ్ ఏ ఛేంజ్ మేకర్' ప్రాజెక్టు కింద మూడు రోజుల 'జెండర్ రెస్పాన్సివ్ గవర్నెన్స్' వర్క్‌షాపు నిర్వహిస్తున్నారు. ఇందులో ఎనిమిది రాష్ట్రాల నుంచి 35 మందికిపైగా మహిళా ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. వీరిలో ఆంధ్రప్రదేశ్ నుంచి 13 మంది పాల్గొనగా గోవా (2), కేరళ (7), సిక్కిం (2), మిజోరం (2), అరుణాచల్‌ప్రదేశ్ (3), మహారాష్ట్ర (10), తమిళనాడు (4) చొప్పున ఉన్నారు.

'ఆమెతోనే మార్పు' (షీ ఈజ్ ఏ ఛేంజ్‌మేకర్) అన్నది ప్రజా ప్రతినిధులుగా ఎన్నికైన మహిళల్లో నాయకత్వ నైపుణ్యతను పెంపొందించే ఉద్దేశంతో చేపట్టిన జాతీయ మహిళా కమిషన్ అధ్వర్యంలోని పాన్ ఇండియా కార్యక్రమం. 2022 జూన్‌లో హిమాచల్ ప్రదేశ్‌లో మొదటి వర్క్‌షాప్ జరుగ్గా రెండవది సెప్టెంబరులో ఉదయ్‌పూర్‌లో జరిగింది. ఇప్పుడు మూడవ వర్క్‌షాపుకు విశాఖపట్నం వేదికైంది.

ఈనెల 4వ తేదీన మొదలై 6వ తేదీతో ముగియనున్న వర్క్‌షాప్‌లో భాగంగా ఆదివారం రాడిసన్ బ్లూ హోటల్‌లో జరిగిన సెషన్‌లో జెండర్ అండ్ చైల్డ్ సెంటర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దిశా పన్ను, సెంటర్ చీఫ్ ప్రోగ్రామ్ ఆఫీసర్ అంజలి చౌహాన్ మాట్లాడారు. సమ్మిళిత సమాజం కోసం మనమందరం ఎలా పని చేయవచ్చనే ఆసక్తికర కార్యాచరణతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. లింగం అనే పదం సంభావిత అవగాహనపై దృష్టి సారించాలన్నారు. రోజువారీ జీవితంలో ఈ పదం కొన్నిసార్లు మహిళా నాయకుల సహజ ఎదుగుదలకు ఆటంకం కలిగిస్తుందన్నారు. డిజిటల్ అక్షరాస్యత-సోషల్ మీడియా శిక్షణ' అంశంపై ముంబైలోని అహాన్ ఫౌండేషన్ అధ్యక్షురాలు సోనాలి మాట్లాడారు. మహిళలపై జరుగుతున్న వివిధ రకాల సైబర్ నేరాల గురించి ప్రస్తావించారు. ఇటువంటి ఘటనల్లో రిపోర్టింగ్ యంత్రాంగాన్ని వివరించారు. సామాజిక మాధ్యమాల్లో ప్రొఫైల్ భద్రత మార్గాలను సూచించారు. 'చర్చల్లో లింగ అంతరాన్ని తగ్గించడం' అనే అంశంపై మాట్లాడిన అహ్మదాబాద్ లోని అంతర్దిషా ఐఐఎం అధ్యక్షురాలు ఇందిరా జె.పారిక్... మహిళల ప్రయాణం, ఆర్థిక, సామాజిక పాత్రలను ప్రస్తావించారు. జేఎన్‌యూ-న్యూఢిల్లీ వైస్ ఛాన్సలర్ శాంతిశ్రీ ధూళిపూడి పండిట్ మాట్లాడుతూ వివిధ స్థాయిల్లో మహిళల భాగస్వామ్యాన్ని, ప్రాతినిధ్యాన్ని పెంచే వ్యూహాలు, అభ్యాసాలను గుర్తించడం, అమలు చేయడంపై దృష్టి సారించాలన్నారు. జెండర్ రెస్పాన్సివ్ బడ్జెట్ వంటి సాధనాల స్వీకరణపై, కమ్యూనికేషన్‌పై దృష్టి పెట్టాలన్నారు. 'షీ ఈజ్ ఏ ఛేంజ్‌మేకర్' ప్రాజెక్ట్ కింద మహిళా కమిషన్ ప్రాంతాల వారీగా మహిళా ప్రతినిధుల కోసం సమర్థ నిర్మాణ కార్యక్రమాన్ని నిర్వహించిందన్నారు. కమ్యూనికేషన్ స్కిల్స్, సమర్థ నిర్వహణ తదితరాలు మెరుగుపరిచే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. అసోం, అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం, తమిళనాడు, మహారాష్ట్ర, కేరళ రాష్ట్రాల నుంచి మహిళా శాసనసభ్యులతో పాటు ఆంధ్రప్రదేశ్ నుంచి శాసన మండలి సభ్యులు వరుదు కళ్యాణి, రెడ్డి శాంతి, కె.శ్రీదేవి, మయాన ఖజియా ఖాన్, జె.పద్మావతి పాల్గొన్నారు.

తాజా పరిమళాల కవిత్వం

ఆకు రాలుతున్న సందర్భంలోని విషాదాన్ని తట్టుకోలేక కలవర పడుతున్న కవి. కురుస్తున్న విద్వేషపు వానలో తడిసి తడిసి ఊపిరాడని కవి. లోతుగా దిగబడిన మనువు వేళ్ళను మొదలంటా తవ్విపారేయాలని తపన పడుతున్న కవి. కురవాల్సిన వర్షం కోసం ఎదురుచూస్తూ అక్షరమై, కవిత్వమై తనను తాను దహించుకుంటున్న కవి శ్రీ వశిష్ఠ సోమేపల్లి. కవిత్వ రహస్యం తెలిసిన కవి ఇతడు. కవికి ప్రతిభ ముఖ్యం. ఏ వస్తువునైనా కవిత్వం చేసే పరుసవేది వుంది ఇతని దగ్గర. శ్రీ వశిష్ఠ సోమేపల్లి పేరు కొత్తదేమీ కాదు కవితా రంగానికి. ఐదేళ్ళుగా తన కలానికి పదును పెడుతున్న కవి. ఇటీవలే 'ఆకురాలిన చప్పుడు' కవితా సంపుటి ప్రచురించారు. మతం మత్తులో మునుగుతూ, ప్రజల్ని ముంచుతూ, దేశభక్తి మంత్రం జపిస్తూ పదవుల కోసం పాకులాడే పాలకుల వ్యవస్థలో అవసరమైన కవి. మనసులో మాట అంటూ మాటలతో మంత్రముగ్ధుల్ని చేసి ప్రశ్న వెయ్యడం నేర్పిన వారినీ, అక్షరాలు వెలిగించిన వాళ్ళను దేశద్రోహుల పేరిట చెరసాలలో బంధిస్తున్న సందర్భమిది. నానాటికీ ప్రజాస్వామ్యం ముసుగులో నియంతృత్వం పడగ విప్పుతున్న విషమకాలంలో ప్రజలను జాగృతం చేసే కవిత్వమిది. స్వాతంత్ర్యం రాకముందు మనల్ని తెల్లవారు విభజించి పాలించారు. ఇప్పుడూ అదే కొనసాగుతుంది. స్వప్రయోజనాల కోసం ప్రజలు కులాలుగా, మతాలుగా విడగొట్టబడ్డారు. తల్లితండ్రులు తమ ఆశలను కోరికలను పిల్లలపై రుద్దుతున్నారు. పిల్లలూ పెరిగి పెద్దయ్యాక తల్లిదండ్రులను పట్టించుకోవడంలేదు. మనుషులందరిలోనూ తడిలేనితనమే. ఇవన్నీ కవి మనసును కలవరపరిచాయి. ఆ కలతలోంచి, కలవరం నుంచీ వచ్చినవే ఈ కవితలు. మనుషులందరూ బాగుండాలని అంతరా లుండగూడదనీ సమ సమాజం కోసం కలకంటాడు కవి. కానీ అది 'పగుళ్ళ కల' అవుతుంది.



"కపోతాలు రెక్కలతో గీతలు చెరుపుతూ/ మట్టిని గోడ పగుళ్ళతో నాటుతాయి/ ఉదయించిన సూరీడు పగుళ్ళ సందులో కాంతిని నింపుతాడు" ఇంతవరకు కవిత మామూలుగానే ఉంటుంది. ఇక్కడ కవి తన కొత్త గొంతుక వినిపిస్తాడు. "ఆరోజు గోడ పగుళ్ళలోంచి మనిషి మొలకెత్తుతాడు/ పెరిగి పెరిగి పలుగై గోడల్ని కూలుస్తాడు/ జెండాలన్నీ వెలిసిపోయి/ ప్రేమనే వీస్తాయి" రాజ్యం తన స్వార్థం కోసం మనుషుల్ని కులమతాలుగా విభజిస్తుంది. వారి మధ్య అంతరాలను, ద్వేషాలను రగిలిస్తుంది. సగటు మనిషి వీటి మాయలో పడి అసలు విషయాన్ని గ్రహించడు. అయినా ఒకనాటికి వీటన్నిటినీ అర్థం చేసుకొన్న మనిషి మొలకెత్తు తాడని, అందరి మధ్య మొలచిన గోడల్ని బద్దలు కొడతాడనీ, విడిపోయిన వారు మళ్ళీ ఏకమవుతారని అంటాడు. మన ప్రస్తుత దేశ చిత్రపటాన్ని ఉన్నది ఉన్నట్లుగా ఆవిష్కరించిన కవిత 'పైకి చెప్పకండి'. ఇప్పుడు ఎక్కడబడితే అక్కడ, ఎప్పుడు పడితే అప్పుడు 'దేశభక్తి', 'దేశం వెలిగిపోతున్నది' నినాదాలు హోరెత్తి పోతున్నాయి. గుండెల్ని కోసే పదునైన వ్యంగ్యం ఈ కవితకు ప్రాణం. "తుపాకీలూ, కత్తులూ, కర్రలూ మనమివ్వక్కర్లేదు/ అవతని వారసత్వ ఆస్తి/ పగిలిన తలకాయలూ, చిరిగిన విద్యాలయాల గుండెలూ/ షటప్!/ దేశం వెలిగిపోతున్నదిప్పుడే..!" అని ప్రజల అభిప్రాయాలు పట్టించుకోని ఫాసిస్టు పాలకుల తీరును దుయ్యబడతాడు.

పితృస్వామ్య వ్యవస్థలో మూఢాచారాలు, సాంప్రదాయాలు మారవు. మనుధర్మ స్మృతులను మరువరు. ఇలాంటి పనికిమాలిన సాంప్రదాయాలను ఎదిరించాలని చెబుతాడు 'మనువు వేర్లు' కవితలో. "చెప్పుకుంటున్న అబద్ధాలు ఇక చాలు/ఓ నిప్పుని ఒప్పుకుందాం/తగలబెట్టేద్దాం/పేజీలైన చెట్టు కొమ్మల్నే కాదు/మనసు పేటికలకి తాళమేసి మరీ/దాచిన మనువు వేర్లను కూడా" అంటూ మనసులోని దిగిన మనువువేర్లను పెకలించి వేయమంటాడు. మన దేశంలో ఆదివాసీలు ఏ ప్రలోభాలకీ ఆశించకుండా ప్రకృతి ఒడిలో హాయిగా సేదదీరుతారు. కానీ ఈ గిరిజనులు నివసించే చోట పాలకులే ఖనిజాల కోసం కొండల్నే తవ్వుతున్నారు. ఆదివాసుల్ని వాళ్ళ ప్రాంతాన్ని విడిచిపొమ్మంటున్నారు. దీనిని ఖండిస్తూ కవి పాలకులపై తిరగబడాలని "అడవి గుండెలో తుపాకీ విత్తుగా మొలవకముందే/కబళిస్తున్న సామ్రాజ్యవాద వూసుల్ని నరికేయాలి/ అణుస్తున్న ఫాసిస్టు ఆలోచనలను నరికేయాలి" అని ప్రజల్లో విప్లవ భావాలు రేకెత్తిస్తాడు. కవి సంఘజీవి. సమాజంలోని సమస్యలకు స్పందిస్తాడు. ఇటీవలే ప్రపంచాన్ని కరోనా అల్లకల్లోలం చేసింది.

మనదేశంలో ఆ దెబ్బకు అందరూ కుదేలులయ్యారు. ముఖ్యంగా వలస కూలీలు వాళ్ళ ఊళ్ళు వెళ్ళడానికి ఎన్నో కష్టాలు పడ్డారు. కాళ్ళకు చెప్పులు లేకుండా, నెత్తి మీద మూటలతో, చంకలో బిడ్డలతో మైళ్ళకు మైళ్ళు నడిచారు. దానికి స్పందించి రాసిన కవిత 'గుండెకూ'.

"మనిషి గుండెల్లో/ఏ క్రిమి జొరబడిందో ఏమో/దేశం గుండెకు పుండు పడింది/సాక్ష్యంగా/దేశం కాలికీ పుండు పడింది" అంటాడు. ఇక్కడ దేశం కాలికీ అనడంలో వలస కూలీలని అర్థం. ఈ విషయాన్ని వాచ్యంగా చెప్పడు. దీన్ని రూపకం చేయడంలో కవి ప్రతిభ ద్యోతకమవుతుంది. కరోనా సమయంలో కరోనా మీద కవిత రాయని కవి లేడు. అందులోనూ వలస కూలీల వెతల మీద స్పందించని వారూలేరు. పుంఖాను పుంఖాలుగా వచ్చిన ఆ కవితల్లో మేలిమి కవిత ఇది. మెజారిటీ ఉందని ప్రభుత్వం అధికారాన్ని చలాయిస్తుంది. ప్రజల అభిప్రాయాలకు, ఇష్టాలకు ప్రాధాన్యం ఇవ్వకుండా ఇష్టం వచ్చినట్టు చట్టాలు చేస్తుంది. ఇటీవల ఏకపక్ష నిర్ణయంగా కాశ్మీర్లో ఆర్టికల్ 370 రద్దు చేసినప్పుడు అక్కడి ప్రజలు పడిన బాధలకు, ఆవేదనలకు అక్షర రూపమిస్తాడు బాణలి కవితలో.ఒకప్పటి అందమైన కాశ్మీరులోని కుంకుమ వనాలు ఇప్పుడు నెత్తుటి పూల వనాలు. దాల్ సరస్సులో పడవఇళ్ళలో ప్రశాంత పయనాలు ఇప్పుడు భయం కలిగించే ప్రయాణాలు. ఇనుప బూట్ల కవాతులు, తుపాకీ పేలుళ్ళ అశాంతి క్షణాలు. భద్రత లేని ప్రజల జీవితాలు. కాశ్మీర్ లోయలోని ఉద్రిక్త పరిస్థితులను "నెత్తుటి జ్వాలల్ని కత్తులు చీల్చలేవు/తూటాలూ ఆర్పలేవు/అవి ఆజ్యమై సూర్యుణ్ణీ కాలుస్తాయి" అని నిత్యం యుద్ధ జ్వాలల మధ్య రగిలే కాశ్మీరును "కాశ్మీరులోయ ఇప్పుడు సలసల కాగే బాణలి" అని అక్కడ యథార్థ హింసాత్మక దృశ్యాలను వర్ణిస్తాడు.

ప్రతిదానికీ మతం రంగు పూయాలనే ప్రస్తుత ప్రభుత్వ ధోరణిని నిరసిస్తూ 'వేదన శిఖరం'గా ప్రతిస్పందిస్తాడు. లోతైన కవిత ఇది. గుంటూరులో జిన్నా టవర్ ప్రసిద్ధం. మతం మత్తులో మునిగిన అంధులు ఒకరోజు జిన్నా టవర్ పై జెండా చుడతారు. ప్రజల్లో కలహాలు సృష్టిస్తారు. దేశభక్తి మంత్రాన్ని వల్లె వేసేవారు వచ్చారని "భుజాన దేశాన్ని మోస్తున్నామంటూ/వాళ్ళెవరో వచ్చారు" అంటూ "నెపమంతా పేరు మీద తోసి/మా ఊరి బొద్రాయికి మతాన్నిపులిమారు/ అంటూ "దేశం నిర్వచనం/కేవలం మూడు పదాల్లోనో/మూడు రంగుల్లోనో కుంచించేది కాదని" అని ఫాసిజం ప్రభుత్వం మీద తన వ్యతిరేకతను వ్యక్తపరుస్తాడు. ఈ కవితా సంపుటి వర్తమాన సమాజ ప్రతిబింబం. స్వాతంత్ర్యం రాకముందు మద్యపాన నిషేధం ఒక ఉద్యమం. స్వాతంత్రం వచ్చాక దానికి పూర్తిగా విరుద్ధం. ఇప్పుడు ప్రభుత్వాలకు ప్రధాన ఆదాయవనరు మద్యం. బడులు, గ్రంథాలయాలు లేక పోయినా వీధి వీధికీ ఒక బారు మాత్రం రంగురంగుల దీపాలతో వెలిగిపోతుంది. ఇప్పుడు ఇంటికైనా దేనికైనా చిరునామా వివరాలు చెప్పాలంటే ఫలానా బారుదగ్గర అని చెప్పక తప్పనిపరిస్థితి. తాగొచ్చి భార్యలను కొట్టడం, ఇంట్లో రూపాయి ఇవ్వకపోవడం, తాగి తాగి మరణించడం. ఇలాంటి తప్పనిసరి పరిస్థితుల్లో ఆ కుటుంబాలను పోషించేది స్త్రీలే. ఈ వాస్తవాన్నే 'కాంతి హననం' కవితలో కళ్ళకు కడతాడు కవి. "దీపం ఇంటికి కాంతులద్దుతోంది/అంతలో/ఫెళ్ళున పగిలిందో సారా సీసా/పక్కనే జీవాన్ని వదులుతూ అతడు/దీప మారింది/ ప్రమిదలో నూనెగా నెత్తురు!/ఇప్పుడా ఇంటికి వెలుగెవ్వరు?/నేను!/అంటూ తానే వత్తై జ్వలించింది ఆమె". సగటు మధ్యతరగతి జీవితాన్ని కరుణ రసాత్మకంగా చిత్రించిన కవిత ఇది.

సమాజంలోని అసమానతలూ, కులభేదాలూ, రాజకీయ నాయకుల సిగ్గులేని తనమూ, కవి మనసులో ఎన్నో ప్రశ్నలు రగిలించాయి. ఓ తల్లి కడుపున పుట్టినందుకు/ముట్టని వాడెందు కయ్యాడు/ భూతల్లి చూడలేని/గీతకవతల పుట్టినందుకు/గిట్టని వాడెందుకయ్యాడు?" అని 'ప్రతి ప్రశ్నా' కవితలో కవి సమాజంలోని కులభేదాలను ప్రశ్నిస్తున్నాడు. రాజ్య హింస గురించి, ప్రభుత్వ నియంతృత్వ పోకడల గురించి ఆందోళన చెందే కవి కేవలం ఆ కవితలకే పరిమితం కాలేదు. ఆకాశంలో సగమైన ఆడవాళ్ళ గురించి రాసిన ఎన్నో కవితలు స్త్రీల పట్ల కవికి కల గౌరవాన్ని తెలుపుతాయి. ఈ సృష్టిలో ప్రతి ఒక్కరూ అమ్మని ప్రేమిస్తారు. కవులైతే మరీ గాఢంగా ప్రేమిస్తారు. 'ఒక అమ్మ'లో అమ్మ గొప్పతనాన్ని "కడుపెండిన ఏ ప్రాణమైనా కనపడితే/తన కడుపు తరుక్కుపోతుంది/పొదుగులతో ఏ తల్లి ఎదురైనా/ఆ పిల్లలకు తానూ అమ్మవుతుంది" అని చెప్తాడు. మామూలుగా ఎవరైనా మానవత్వం మరణించిందని, మనుషులుగా బతకమని చెప్తారు. కానీ ఈ కవి "ఇప్పుడు కావాల్సింది/మనుషులుగా బతకడం కాదు/అమ్మలుగా బతికించడమని" చెప్తాడు. అమ్మంటే అంత గొప్ప భావం. 'అతనెవరో'లో స్త్రీల అనంత దుఃఖానికి అక్షర రూపమిస్తాడు. "ఓ విచ్ఛిన్న మృతదేహం దొరికిన సమాచారం" సరిహద్దుల్లో మరణించిన ఒక సైనికుని గురించి "నినాదాన్ని గుప్పెట్లోనింపి నింగి గుండెలో జొనిపిన చేయి/ అతనెవరో తెలిస్తే చెప్పరాదూ/అతని వార్తని ఆమెకి తెలియజేయాలి" అంటూ ఆమె ఆనవాళ్ళు గురించి "గుండెంతా కన్నీళ్ళతోనూ/కళ్ళంతా అతనిని దాచుకున్న దోసిళ్ళతోనూ నిండి వుంటాయి/లోలోన ఏదో పురుగు కొంచెంకొంచెంగా ఆమెను తింటున్న నొప్పి" అంటూ "దేశాలంతా ఆమెలే/దేశాలన్నీ ఆమెను తింటున్న పురుగులే" మగాధిపత్య సమాజంలో స్త్రీలపై జరిగే హింసను ఆవిష్కరిస్తాడు.

ముఖపత్ర కవిత 'ఆకురాలిన చప్పుడు'లో ఈ సమాజం సామాన్య మానవునిపై ఝుళిపించే హింసను గూర్చి ఆక్రోశిస్తాడు. నగరంలో నిరంతర ఘోష ఉంటుంది కానీ మానవ సంబంధాలు ఉండవు. ఒకరినొకరు పలకరించుకునే మాటలు చప్పుడు ఉండదు. అలా మాట కోసం వెతికినప్పుడు ఆకురాలిన చప్పుడు వినిపిస్తుంది అంటాడు కవి. 'ఆకురాలిన చప్పుడు' పేరు లోనే నూతనత్వం. చెట్టు మీద నుంచి ఆకు రాలితే ఏమాత్రం సవ్వడి వినపడదు. మనం ఎంతో నిశ్శబ్దంగా ఉంటే గాని ఆకురాలిన మృదు మధుర శబ్దం మన చెవుల్లో పడదు. ఈ శీర్షికలోనే ఒక విషాద భారం "ఎంత హింస/మౌనం చేసే గాయాలకు లేపనాలుండవు అని నగర జీవితంలోని అంతులేని యాంత్రికతను, పొడిబారినతనాన్ని వ్యాఖ్యానిస్తాడు. కొన్ని కవితలు తాత్వికతా పరిమళాలు వెదజల్లుతాయి. మరణం గొప్పవాళ్ళనైనా, బీదవాళ్ళనైనా ఒకలాగే పలకరిస్తుంది. ఈ భావాన్నే 'అనల్పం' లో "అల్పమేదీ లేదు/మరణమంతా ఒక్కటే/ కుక్కపిల్లదైనా /చలిచీమదైనా/ పసిపిల్లదైనా" అని అందరి చావూ ఒకటేనని తీర్పునిస్తాడు. కవిత్వమెప్పుడూ సమకాలీన సమాజాన్ని ప్రతిఫలించాలి. అన్యాయాలను ఎదిరించాలి. అక్రమాలను ప్రతిఘటించాలి. ప్రజల పక్షాన గొంతెత్తి పాలకులను నిలదీయాలి. సమకాలీన సమాజాన్ని ప్రతిబింబించిన ఈ కవితా సంపుటిలోని కవితలన్నిటికీ వ్యంగ్యం ప్రాణం. 'ఆకులందున అణిగిమణిగి కవిత కోయిల పలకవలనోయ్' అన్నట్లు ఎక్కడా వాచ్యమై పచించదు. తొలి సంపుటిలో ఎవరైనా ప్రకృతినో, ప్రణయాన్నో ఆరాధిస్తారు. కానీ ఈ కవి మొదటి సంపుటిలోనే ఆలోచనలు రేకెత్తించే విభిన్న వస్తువులను తీసుకుని కవిత్వీకరించాడు. ఒక స్పష్టమైన లక్ష్యాన్ని ప్రతిబింబించిన ఈ సంపుటిలోని కవితల్లోని వస్తు శిల్పాలు అధునాతమైనవి. అప్పుడే పుట్టిన పసిపిల్లల్లాటి పదాలు, కొత్త ఊహలు, కల్పనలు పాఠకుల్ని పరవశింపచేస్తాయి. ఎక్కడా పడికట్టు పదాలు, మూసపోసిన వాక్యాలు లేవు. ఈ పుస్తకమంతా చదివాక తాజాగాలులు వీచే కవనవనంలో విహరించినట్లుంటుంది. కవికి ఇది తొలి సంపుటైనా అలా అనిపించదు.

ఫాసిస్టు ప్రభుత్వ క్రూర స్వభావంపై ఎక్కుపెట్టిన బాణాలు ఈ కవితలు. అందరికీ అన్నం బెట్టే అన్నదాతలు తాము తినడానికి అన్నంలేక ఉరితాళ్ళను ఆశ్రయించడం గురించి, బానిసలకే బానిసైన స్త్రీల జీవితాలలోని హింస గురించి, వేయి పడగల మతం సామాన్యుని జీవితంలో అణువణువునా విస్తరించడం గురించి కలవరపడి, రాయకుండా వుండలేక రాసిన కవితలివి. గాయపడిన ప్రజలు, అణిచివేతకు గురైన వారు ప్రశ్నలై మొలకెత్తాలనే కవి ఆక్రోశం 'ఆకురాలిన చప్పుడు' అక్షరమక్షరంలో ప్రత్యక్షమవుతుంది. 'అతనూ సందర్భమూ', 'అప్పుడప్పుడు', 'అద్దాలో', 'ఏమని ప్రకటించుకుందాం?', 'కురవాల్సిన వర్షం', 'విద్వేషపు వాన', 'వెతుక్కోవడం', 'ఇంకొంచెం తవ్వండి' కవితలు చదివినప్పుడు మనసు కలవరపడుతుంది. 'మీసం ముద్దు' కేవలం మగ కవి మాత్రమే రాసే కవిత. నూతన భావచిత్రాలు, రూపకాలు వశిష్ఠ కవిత్వంలో కొల్లలుగా కనిపిస్తాయి. ఏవీ కృత్రిమంగా ఉండవు. 'నదుల దేహాలు', 'తూటాల పూలు', 'జైలు జీర', 'కంటి తలుపులు', 'మనిషి తోటలు', 'జ్ఞాపకాల మెతుకులు', 'సామ్యవాద పల్లకి', 'నాన్న చెట్టు పాదాలు' వంటి రూపకాలు 'ఆహా' అనిపిస్తాయి. కవితలన్నీ ఆలోచింపచేస్తాయి. ప్రతిభావంతుడైన ఈ కవి తాను మొదట్లో చెప్పుకున్నట్లు శిలగా కాకుండా శిల్పమై పరిణమించాలని, తెలుగు కవితా ప్రపంచంలో తనదైన ముద్ర వేయాలని, మరెన్నో కొత్త సంపుటులు ప్రచురించాలని ఆశిస్తూ అభినందిస్తున్నాను.

మందరపు హైమవతి, ఫోన్: 9441062732

సాహితి

జ్ఞాపకాలు

సతాయిస్తున్న
జ్ఞాపకాలను
ఉతికి
దండెం మీద
ఆరేశాను!

జ్ఞాపకాలను
వేడి వేడి బజ్జీల్లాగా
ఊదుకుంటూ
తింటున్నాను!

జ్ఞాపకాల/జడిలో
తడిసి/ముద్దయ్యాను!

జ్ఞాపకాలు
మొలుస్తున్నాయ్
పచ్చగా/పంట నూర్చి
అందరికీ
పంచేదెప్పుడో?

నెరిసి/రాలిపోతున్న
జుత్తులో
జ్ఞాపకాల
డి ఎన్ ఏ జాడలు!

- కేశవ్ గోపాల్

మట్టి నుండి మట్టిలోకి...

జలపాతపు సెగ
కళ్ళలోకి ఒలికింది
గుండె అదిరి
ఆర్తధ్వని పరచుకుంది
పాట తెగి
ఎగతెగని యాది తరిమింది
మనసు సముద్రం ఇంకోసారి
అల్లకల్లోల గాయాల కేంద్రమైంది
ఉరిసే కష్టమైంది
కనికరం మరచిన కసాయి కాలమే..
నిర్దయగా అది
కలల పుస్తకాల్ని చించేసింది
కండ్ల దీపాలను ఆర్పేసింది
సింగిడీలను రాల్చేసింది
పూల గుడిసెల్ని కూల్చేసింది
అలల అనుబంధాల్ని ఆబగా తొక్కేసి
అనుభూతుల్ని నలిపేసింది
ఇంకిపోయిన అమాయకపు ప్రాణం
చివరికి ఒయాసిస్సులోకి చేరింది
వెతుకులాటలు పూర్తిగా ఆగాయి
కాలం మాయాజాలంలో
జీవన శైథిల్యమే మిగిలింది

సత్యం ఇక్కడే స్పష్టమైంది
కాలం మనిషికిచ్చిన
అతి స్వల్ప అనల్ప అవకాశం జీవితం
జనన మరణాలు ఒట్టి యాదృశ్చికాలు
ఏది ఎప్పుడో
ఏ ఆట చివరిదో చెప్పలేం
అందుకే...
మట్టే నిజం
మట్టే నిరంతరం
మట్టే భాస్వరం
మట్టే జీవన స్వరం
మట్టే సతతం
మట్టే సర్వస్వం
ఇదే నిజం
మనిషి ప్రయాణం
మట్టి నుండి మట్టిలోకి...

తిరునగరి శ్రీనివాస్, 8466053933

వచన కవితా సంపుటాలకు ఆహ్వానం

'వెన్నెల సాహితీ పురస్కారం-2022' కొరకు 2022 సం.లో ప్రచురించిన వచన కవితా సంపుటాలు నాలుగు (4) ప్రతులను ఈక్రింది చిరునామాకు, 28 ఫిబ్రవరి 2023లోపు పంపగలరు. సిద్దిపేటలో జరుగు సాహిత్య కార్యక్రమంలో నగదు పురస్కారం అందజేయబడును.

కవితా సంపుటాలను పంపు చిరునామా:

కొండి మల్లారెడ్డి, ఇం.నెం. 19-61/5/సి, విద్యానగర్,
రోడ్.నెం.3, మిలన్‌గార్డెన్ రోడ్.
కుశాల్‌నగర్, సిద్ధిపేట-502103,సెల్: 9652199182,9299909516

పర్కపెల్లి.యాదగిరి, వెన్నెల సాహితీసంగమం, ప్రధాన కార్యదర్శి

మంచి పుస్తకం

మోదీ పాలన మూల్యం

బీజేపీ అగ్రనాయకుడు అతల్ బిహారీ వాజపేయి మొట్టమొదటి సారి 1996 మేలో అధికారంలోకి వచ్చినప్పుడు ఆ ప్రభుత్వం మనగలుగుతుందన్న భ్రమ ఎవరికీ లేదు. 1998 మార్చిలో ఆయన రెండోసారి ప్రధానమంత్రి అయినా సంఘ్‌పరివార్ ప్రభావం అంతగా కనిపించలేదు. ఆ తరవాత ఆయన అయిదేళ్ల పదవీకాలం పూర్తి చేసినప్పుడు మాత్రం సంఘ్‌పరివార్ ఎజెండా అమలు చేయడానికి నర్మగర్భంగా మాత్రమే ప్రయత్నం జరిగింది.

నరేంద్ర మోదీ 2014లో ప్రధానమంత్రి అయిన తరవాత హిందుత్వ సిద్ధాంత వ్యాప్తి దేశమంతటా అమలు చేస్తున్న ఛాయలు కనిపించాయి. 2019లో మోదీ మరింత మెజారిటీ సాధించిన తరవాత సంఘ్‌పరివార్ ఎజెండా అమలు చేయడం జోరెక్కింది. ఆర్ఎస్ఎస్ ఎజెండా ఎలా అమలు చేయాలో వాజపేయికి అంతగా అర్థమైనట్టు లేదు. ఉన్న పరిమితులలో ఆయన కొంత ప్రయత్నం చేశారు. పైగా బీజేపీ చుట్టూ జనసమీకరణ సాధించింది అద్వాణీ తప్ప వాజపేయి కాదు.

మోదీ జాతీయస్థాయిలో నాయకత్వం చేపట్టిన తరవాత బీజేపీకి, ఆర్ఎస్ ఎస్‌కు మధ్య బంధం మూలాల నుంచి బలపడింది. అద్వాణీ బాబ్రీ ఉద్యమం సెక్యులర్ భావాలున్న హిందువులలో కూడా తాము హిందువులమన్న చైతన్యం పెంపొందించడానికి దోహదం చేసింది. మోదీ ఏలుబడిలో ఆర్ఎస్ఎస్‌తో బంధం ఎంత గట్టిపడినా హిందుత్వం సర్వవ్యాప్తం కావడంతో పాటు ఆర్ఎస్ఎస్ మోదీ మీద ఆధారపడవలసిన పరిస్థితి ఏర్పడింది. ఒకప్పుడు ఆర్ఎస్ఎస్‌ను మతతత్వ సంస్థగా భావించే వారు. ఇప్పుడు ఆ మతతత్వమే చెలామణిలో ఉంది. సెక్యులర్ అన్న మాటను అద్వాణీ ఎద్దేవా చేసినంతగా ఎవరూ చేయలేదు. ఆయన తన పాండిత్యాన్ని అంతా ఉపయోగించి "సిక్యులర్" (రుజాగ్రస్థ) అన్న మాట ప్రచారంలో పెట్టారు. ఇప్పుడు మోదీ దూకుడుగా అమలు చేస్తున్న హిందుత్వే సెక్యులర్ అని నమ్మే పరిస్థితికి చేరుకున్నాం. ఆర్ఎస్ఎస్ ప్రస్తుతం మోదీని ఆదేశించే స్థితిలో లేదు. మోదీ చేసిన ప్రతిపనికి ఆమోదముద్ర వేయడం, దాన్నే ప్రచారంలో పెట్టడం ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ బాధ్యత అయింది.

మోదీ ఏలుబడిలో దేశంలో స్థితిగతులు ఏమిటో వివరించడానికి ఆకార్ పటేల్ 488 పేజీలలో 'ప్రైస్ ఆఫ్ ది మోదీ ఇయర్స్" రాశారు. 2021లో ఇది వెలువడింది. విస్తృతంగా చర్చలోకి వచ్చింది. రచయిత, వృత్తిరీత్యా పత్రికా రచయిత అయిన ఆకార్ పటేల్ రాజకీయ పరిణామాలను నిశితంగా పరిశీలిస్తారు. మోదీ పరిపాలనను అంచనా వేయడానికి ఆయన కేవలం రాజకీయ వ్యాఖ్యానాలకే పరిమితం కాలేదు. ప్రతి విషయాన్ని సోపపత్తికంగా నిరూపించడానికి అవసరమైన గణాంకాలు, వాస్తవాలు, సమాచారం అందజేశారు. వివిధ రంగాలకు సంబంధించి భిన్న దేశాల స్థితి ఏమిటో అంచనా వేయడానికి అంతర్జాతీయ వ్యవస్థలు పనిచేస్తాయి. ఇవన్నీ మనదేశం ఏ రంగంలో ఏ స్థానంలో ఉందో విడమరుస్తుంది. దాదాపు అన్ని రంగాలలో మోదీ ప్రభుత్వం అడుగునుంచి అగ్రస్థానంలో ఉన్న వైనాన్ని ఆకార్ పటేల్ అందించిన సమాచారాన్ని చూస్తే అర్థం అవుతుంది.

మొదట భారతీయ జనసంఘ్‌ను, ఆ తరవాత దాని మలి రూపమైన బీజేపీని నిలబెట్టడానికి, జన సమీకరణకు వాజపేయి, అద్వాణీ దశాబ్దాల తరబడి పాటుపడాల్సి వచ్చింది. అయితే ఆ ఇద్దరు నేతలూ జన సమీకరణకు, పార్టీ నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తే మోదీ పార్టీ శ్రేణులకే పరిమితం కాకుండా సామాన్య జనానికి హిందుత్వ భావజాలం నూరిపోయడంలో సఫలమయ్యారు. దీనికోసం ఆయన విలోమ పద్ధతి ఎంచుకున్నారు. హిందువులు సమైక్యం కావలసిన అవసరం గురించి మహోపన్యాసాలు చేయలేదు. ముస్లింల మీద విద్వేషం పెరిగేట్టు చేసి, హిందువులు ప్రమాదంలో ఉన్నారని నమ్మించి... హిందువుల సమీకరణ సునాయాసంగా సాధించారు. ఇందులోనూ ఆయన నోరు విప్పి చేసినదానికన్నా గుప్పెట్లో ఉన్న ప్రభుత్వాధికారాన్ని వినియోగించు కుని సాధించిందే ఎక్కువ. ముస్లింలను నస్మరంతిగాళ్లను చేయడంలో మోదీ కౌటిల్యం అసామాన్యమైంది. కరడుగట్టిన మితవాదాన్ని తీవ్రరూపంలో అమలు చేయడంలో మోదీకి సాటి ఎవరూ లేరు.

ఆ క్రమంలో ఆయన బీజేపీ మీదో, ఆర్ఎస్ఎస్ మీదో ఆధారపడ్డదానికన్నా తన వ్యక్తిత్వాన్ని, పలుకుబడిని, తనమీద వ్యక్తి ఆరాధనా తత్వాన్ని పెంపొందించి తానే ఒక విరాట్రూపంగా తయారయ్యారు. అందుకే బీజేపీ, ఆర్ఎస్ఎస్ ఇప్పుడు మోదీకి అనుషంగాలుగా మిగిలిపోయాయి. ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు మొదట మోదీకి విశ్వాసపాత్రంగా మెలుగుతారు. ఆ తరవాతే మోహన్ భగవత్ సంగతి. అద్వాణీ లాంటి యోధానుయోధులనే ఎందుకూ కొరగాకుండా పక్కకు నెట్టేసిన మోదీ హిందుత్వవాదులను ఏకోశ్వరోపాసకులుగా మార్చేశారు. సంఘ్ పరివార్‌కు నిజానికి విగ్రహారాధనలో విశ్వాసం ఉండదు. రామజన్మ భూమి ఉద్యమం ద్వారా అద్వాణీ ఆ భావనను పాదుకొల్పితే మోదీ బీజేపీ మొత్తాన్నే కాదు, బీజేపీలాగే ఆలోచించే మధ్య తరగతి జీవులందరినీ భక్తులుగా మార్చేశారు. ఒకవేపున మోదీ, మరోవేపున మోదీ భక్తులు. అంతే.

సెక్యులరిజం అన్న మాటను మోదీ ఎంతగా అప్రతిష్ట పాలు చేశారంటే ఇప్పుడు కరడుగట్టిన సెక్యులర్ పార్టీలు సైతం ఆ మాట ఉచ్చరించడానికే జంకుతున్నాయి. సెక్యులరిజం, రాజ్యాంగ మౌలిక స్వరూపం లాంటి మాటలు ఇప్పుడు ఇంకా ఇంగువ గుడ్డ వాసన వదలని న్యాయస్థానాల్లో మాత్రమే అరుదుగా వినిపిస్తాయి. మిగతా చోట్ల అవి అపశబ్దాలే.



మోదీ సర్వాంతర్యామి అయిపోయాడు గనక ఆయన పరిపాలన ఎలా ఉంది, ఎలా ఉంటుంది అని చర్చించడమే ఈ గ్రంథంలో ఆకార్ పటేల్ చేసిన పని. వ్యక్తి ఆరాధనను ప్రోత్సహించడానికి మోదీ ఏ మాత్రం బిడియ పడరు. 'మోదీ హై తో ముంకిన్ హై (మోదీ ఉంటే సాధ్యమే)' లాంటి మాటలు చెప్పడానికి ఎంత ఆత్మ నిబ్బరం ఉండాలి! ముఖాముఖి సంభాషణల్లోనూ మోదీ తనను తాను మోదీ అని ప్రథమ పురుషే ప్రయోగిస్తారు.

2019 సార్వత్రిక ఎన్నికలలో విజయం సాధించిన తరవాత ఓ బ్రిటిష్ జర్నలిస్టుతో మాట్లాడుతూ 'ఇది ఇరవై ఒకటవ శతాబ్దం. ఇది నూతన భారతం. మేం ఎన్నికల్లో గెలిచిన తరవాత "మోదీ, మోదీ, మోదీ" నినాదాలు మిన్నంటాయి. ఇది మోదీ విజయం కాదు. నేటి విజయం మోదీ విజయం ఏమీ కాదు. ఈ విజయం దేశ ప్రజలందరి ఆకాంక్షల విజయం. నిజాయతీ కోసం అంగలారుస్తున్న వారి గెలుపు" అని అన్నారు. ఈ మాట్లో బోలెడు వినయం కనిపిస్తోంది. కొంచెం తెరతీసి చూస్తే కనిపించేది... అంతా అహంకార ధోరణే. మరొక సందర్భంలో మోదీ ఏమన్నారో వింటే ఆయన అహంభావం ఎంత లోతైందో అర్థం అవుతుంది. 'నేను గుజరాత్ ముఖ్యమంత్రిని అయిన తరవాత మూడు నాలుగు రోజులకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఓ ఫైళ్ల గుట్ట నా టేబులు మీద పెట్టించారు. నేను వాటి వంకే చూడలేదు. నేను ఇవన్నీ చదవలేను. వీటిల్లో ఉన్న విషయం ఏమిటో చెప్పండి. ఇవన్నీ చదవడం మొదలు పెడ్తే దానికి అంతే ఉండదు. ఫైళ్లు చదవడం నా స్వభావం కాదు. ఈ ఫైళ్లల్లో ఏముందో చెప్పండి చాలు" అన్నాను అంటారు మోదీ. "ఒక్కసారి వింటే చాలు నాకు గుర్తుండిపోతుంది. చిన్న చిన్న వివరాలు కూడా గుర్తుంటాయి. నేను అధికారులతో వాదించను. అయితే వారు చెప్పేది జాగ్రత్తగా వింటాను. విన్న దాన్ని విశ్లేషించు కుంటాను. వర్గీకరిస్తాను. మదిలో ఏ డబ్బాలో ఏముండాలో తేల్చుకుంటాను. దీనికి నాకు అట్టే సమయం పట్టదు. పది పేజీల పత్రాన్ని అర్థం చేసుకోవడానికి నాకు రెండు నిముషాలు చాలు. ఈ నేర్పు నాకు అలవడింది" అంటారు మోదీ. ఈ మాటల్లో ఆత్మవిశ్వాసం కన్నా అహంభావ ఛాయలే ఎక్కువగా కనిపిస్తున్నాయి కదూ. ఈ పొరలను తొలగించడమే ఆకార్ పటేల్ చేసిన పని.

- ఆర్వీ రామారావ్

జోడో యాత్ర 'బూస్టర్ డోసేనా'

- కాంగ్రెస్ పంట పండుతుందా?
- ఎన్నికల రాష్ట్రాలపై దాని ప్రభావం ఎంత?
- పార్టీలో ముఠాపోరు పరిష్కారమయ్యేనా?

న్యూదిల్లీ/జైపూర్/భోపాల్: భారత్ జోడో యాత్రను కాంగ్రెస్ 'బూస్టర్ డోస్'గా అభివర్ణించింది. కానీ రాజస్థాన్, చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, కర్ణాటక వంటి ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో పార్టీకి అది ఒక కొత్త జీవితాన్ని ఇస్తుందా అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. ఇది ఎన్నికల యాత్ర కాదని, ఆలోచనల యుద్ధభూమిని సంగ్రహించే లక్ష్యంతో చేపట్టిన సైద్ధాంతిక యాత్ర అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ పునరుద్ఘాటించినప్పటికీ, రాజకీయ పండితులు మాత్రం 2024 ఎన్నికలకు ముందు తన అదృష్టాన్ని పరీక్షించుకుంటుందని అంటున్నారు. ఈ ఏడాది తొమ్మిది రాష్ట్రాలలో అసెంబ్లీ ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. కర్ణాటక, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తెలంగాణ నాలుగు రాష్ట్రాల మీదుగా యాత్ర సాగింది. కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు 4 వేల కి.మీ యాత్ర ఈ రాష్ట్రాల్లోని పార్టీ కార్యకర్తలను కచ్చితంగా ఉత్సాహపరిచింది. అయితే ఇది అసెంబ్లీ ఎన్నికలలో ప్రభావాన్ని చూపుతుందా, రాష్ట్ర పార్టీ విభాగాలు ఊపందుకుంటాయా అనే ప్రశ్నలకు సమాధానం రావాల్సి ఉంది. భారత్ జోడో యాత్ర తర్వాత ఏమిటి అనేది కాంగ్రెస్ ముందున్న ప్రశ్న. రాజస్థాన్, కర్ణాటక, తెలంగాణ వంటి రాష్ట్రాలలో సంప్రదాయబద్ధంగా పార్టీ చీలికలతో దెబ్బతింటున్నప్పుడు సంస్థాగత ఐక్యత ఒక ప్రధాన సవాలు. కర్ణాటక, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో యాత్రతో కాంగ్రెస్ కొంత లాభపడినట్లు కనిపిస్తుండగా, రాజస్థాన్‌లో ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోత్, ఆయన ప్రత్యర్థి సచిన్ పైలట్ మధ్య వర్గపోరు నిరాటంకంగా కొనసాగుతోంది. భారత్ జోడో యాత్ర రాజస్థాన్‌లో డిసెంబరు 21న ముగిసింది. రోడ్లపై నినాదాలు చేసినప్పటికీ గెహ్లోత్, పైలట్ మద్దతుదారుల మధ్య ఎటువంటి ఘర్షణ లేకుండా రాష్ట్రాన్ని దాటడంతో కాంగ్రెస్ ఊపిరిపీల్చుకుంది. కానీ ఆ తర్వాత వెంటనే పైలట్ రాష్ట్రంలో ప్రజలకు చేరువయ్యే కార్యక్రమాల శ్రేణిని ప్రకటించారు. ఇది చాలామంది బల ప్రదర్శనగా, అధిష్ఠానం గుర్తుగా భావించారు. కానీ ఆయన మనోభీష్టం పరిష్కారం కాలేదు. పైలట్ పదేపదే పేపర్ లీక్‌లు, విశ్రాంత అధికారుల రాజకీయ నియామకాలు వంటి ఆరోపణలతో గెహ్లోత్ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టారు. ఇది పార్టీ కార్యకర్తలను పక్కదారి పట్టించింది. అదే సమయంలో ఆయనను ముఖ్యమంత్రిని చేయాలనే డిమాండ్ మళ్లీ ప్రారంభమైంది. ఆయనకు విధేయులైన నాయకులు ఎన్నికలకు ముందు పైలట్‌కు అత్యున్నత పదవి ఇవ్వాలని బహిరంగంగా పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రావాలంటే గెహ్లోత్-పైలట్ ప్రశ్నకు పరిష్కారం కావాలి. లేకుంటే యాత్ర వల్ల వచ్చే లాభాలు శూన్యమని పార్టీ కార్యకర్తలు అంటున్నారు. పేరు వెల్లడించడానికి ఇష్టపడని ఒక పార్టీ కార్యకర్త మాట్లాడుతూ 'యాత్ర పార్టీ అవకాశాలను పెంచింది. అయితే ఇద్దరు సీనియర్ కాంగ్రెస్ నాయకుల మధ్య సమస్యలు ఇప్పటికీ పరిష్కారం కాలేదు. ఇది రాబోయే ఎన్నికలలో పార్టీ అవకాశాలపై ప్రతికూల ప్రభావం చూపుతుంది' అని తెలిపారు. పార్టీ నేతలంతా ఐక్యంగా ఉండాల్సిన అవసరం ఉందని, గెహ్లోత్-పైలట్ పోరు పార్టీని బలహీనపరిచేలా ఉందని మరో పార్టీ కార్యకర్త అన్నారు. మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, తెలంగాణ, కర్ణాటక వంటి ఇతర ఎన్నికలకు వెళ్లే రాష్ట్రాలలో పార్టీ కార్యకర్తలలో అంతర్లీన భావన కూడా ఇదే. ఎందుకంటే నాయకుల వ్యక్తిగత ఆశయాలను అదుపు చేయడం నాయకత్వానికి అతుక్కుపోయే అంశంగా ఉంటుంది. జైరాం రమేశ్ ఇటీవల పీటీఐతో మాట్లాడుతూ వ్యక్తిగత ఆశయాలు, వ్యక్తిగత లక్ష్యాలు కాంగ్రెస్‌కు శాపంగా మారాయని అన్నారు. భారత్ జోడో యాత్ర ఏం చేసిందంటే, ఇది సమష్టి ప్రయోజనం, సంఘీభావాన్ని తీసుకువచ్చిందని, రాజస్థాన్ సహా రాష్ట్రాల తర్వాత రాష్ట్రానికి ఇది అవసరమని ఆయన అన్నారు. కర్ణాటకలో ముఖ్యమంత్రి ఆశావహులు సిద్ధరామయ్య, డీకే శివకుమార్ మధ్య చిచ్చు రేగుతున్నప్పటికీ, యాత్ర ముగిసిన తర్వాత కాంగ్రెస్‌కు సానుకూల సంకేతాలు వస్తున్నాయి. పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు శివకుమార్, అసెంబ్లీలో ప్రతిపక్ష నేత సిద్ధరామయ్య సంయుక్తంగా 'ప్రజాధ్వని యాత్ర' పేరుతో రాష్ట్రవ్యాప్త బస్సుయాత్ర ప్రారంభించారు. కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రతి మహిళా ఇంటి పెద్దకు నెలకు రూ.2 వేలు ఇస్తామని హామీ ఇచ్చింది. గత నెలలో కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా హాజరైన సమావేశంలో ఈ ప్రకటన చేశారు. మధ్యప్రదేశ్‌లో 2023 ఎన్నికల కోసం జోడో యాత్ర నుంచి ప్రయోజనం పొందడానికి కాంగ్రెస్ రాజకీయ కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ఊపందుకోవలసి ఉందని విశ్లేషకులు అంటున్నారు. మధ్యప్రదేశ్ మాజీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఎస్‌సీ త్రిపాఠి మాట్లాడుతూ 'భారత్ జోడో యాత్ర తర్వాత కాంగ్రెస్ 2023 ఎన్నికల్లో ప్రయోజనం పొందడానికి అనేక తదుపరి చర్యలు చేపట్టాలి. అందుకు పార్టీ కార్యాచరణ రూపొందించుకోవాలి. యాత్ర కేవలం రాష్ట్రంలోని ఒక భాగానికి మాత్రమే పరిమితమైనందున తదుపరి చర్యలు జరగకపోతే ఇతర ప్రాంతాలపై ఎక్కువ ప్రభావం చూపదు' అని అన్నారు. కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు జరిగిన యాత్ర మధ్యప్రదేశ్‌లోని పార్టీ కార్యకర్తలను ఉత్సాహపరిచింది. అయితే ఓటర్లలో దాని ప్రభావం ఎన్నికల సమయంలో మాత్రమే కనిపిస్తుందని సీనియర్ పాత్రికేయుడు, రచయిత రషీద్ కిద్వాయ్ అన్నారు. రాహుల్‌గాంధీ నేతృత్వంలోని 'భారత్ జోడో యాత్ర' పార్టీ అధికారంలో ఉన్న చత్తీస్‌గఢ్ మీదుగా సాగకపోయినప్పటికీ, రాష్ట్రానికి చెందిన నాయకులు, కార్యకర్తలు, భావసారూప్యత గల వ్యక్తులు దేశవ్యాప్తంగా వివిధ ప్రదేశాలలో పాదయాత్రలో భాగస్వాములయ్యారు. దీంతో పార్టీ కార్యకర్తల మనోధైర్యాన్ని పెంపొందించేలా పాదయాత్రతో పరోక్ష ప్రభావం ఉంది. ఈ ఏడాది రాష్ట్రంలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఈ యాత్ర పార్టీ కార్యకర్తలను ఉత్సాహపరించింది. ఇప్పుడు రాహుల్ గాంధీ ప్రేమ, సమానత్వం అనే సందేశాన్ని ప్రచారం చేయడానికి 'హాత్ సే హాత్ జోడో అభియాన్'పై కృషి చేస్తున్నామని కాంగ్రెస్ కమ్యూనికేషన్ విభాగం రాష్ట్ర నాయకుడు సుశీల్ శుక్లా తెలిపారు. చత్తీస్‌గఢ్‌లో భారత్ జోడో యాత్రపై ఇప్పటికిప్పుడు కచ్చితమైన అంచనా వేయలేమని, అయితే ఇది నిస్సందేహంగా బీజేపీని ఎదుర్కోవడానికి, రెండవసారి అధికారాన్ని నిలబెట్టుకోవడానికి పార్టీ కార్యకర్తలకు కొత్తశక్తిని ఇచ్చిందని రాజకీయ విశ్లేషకుడు, సీనియర్ జర్నలిస్ట్ ఆర్.కృష్ణ దాస్ అన్నారు. 'భారత్ జోడో యాత్ర' కచ్చితంగా కాంగ్రెస్ కార్యకర్తలను ఉత్సాహపరించింది. అయితే ఇది ఎన్నికల ప్రభావం కోసం, రాబోయే 'హాత్ సే హాత్ జోడో అభియాన్', ఇది యాత్ర సందేశాన్ని ప్రతి ఇంటికీ తీసుకెళ్లడానికి ప్రయత్నిస్తుంది. వర్గ విభేదాలను పరిష్కరించడం క్లిష్టమైన అంశాలుగా మిగిలిపోయింది. రాహుల్ పాదయాత్ర కాంగ్రెస్ పంట పండించగలదా లేదా అనేది కాలమే నిర్ణయిస్తుంది.

'అమృత్ ఉద్యాన్'ను సందర్శించిన సీజేఐ

న్యూదిల్లీ: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రత్యేక ఆహ్వానం మేరకు భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ఆదివారం రాష్ట్రపతి భవన్‌లోని అమృత్ ఉద్యానవనాన్ని సందర్శించారు. ఈ మేరకు రాష్ట్రపతి ట్వీట్ చేశారు. తనతో పాటు న్యాయమూర్తులు ఉద్యానవనాన్ని సందర్శించిన ఫొటోలను పోస్ట్ చేశారు. జనవరి 29న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాష్ట్రపతి భవన్‌లోని గార్డెన్స్‌లో 'అమృత్ ఉద్యాన్' ప్రారంభోత్సవానికి హాజరయ్యారు. 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్'లో భాగంగా రాష్ట్రపతి భవన్‌లోని ఉద్యానవనాలకు 'అమృత్ ఉద్యాన్' అని పేరు పెట్టారు. జనవరి 31 నుంచి అమృత్ ఉద్యాన్‌లోకి ప్రజలను అనుమతిస్తున్నట్లు రాష్ట్రపతి భవన్ ప్రకటించింది. ప్రజల సందర్శన కోసం 2 నెలల పాటు ప్రవేశం కల్పించనుంది. సాధారణంగా ప్రజల సందర్శన కోసం ఉద్యానవనాన్ని నెల పాటు తెరుస్తారు. కానీ ఈసారి ఫిబ్రవరి నుంచి మార్చి 26 వరకు (నిర్వహణ రోజులైన సోమవారాలు, హోలీ సందర్భంగా మార్చి 8న మినహా) మరో నెల పెంచారు. అప్పటి వరకు అక్కడి పుష్పాలు వికసించే ఉంటాయట. అందుకే మరో నెల పొడిగించినట్లు రాష్ట్రపతి భవన్ వర్గాలు ప్రకటించాయి. ఇక మార్చి 28 నుంచి 31 వరకు, ఉద్యానవనాల్లోకి ప్రత్యేక ప్రవేశాలుంటాయి. రాష్ట్రపతి భవన్‌లో 15 ఎకరాల్లో మొఘల్ గార్డెన్ ఉంది. దీన్ని మొఘల్ చక్రవర్తులు నిర్మించారు. ఇవి పెర్షియన్ శైలిలో నిర్మించిన తోటలు. ఈ రకం తోటలు పెర్షియా తోటల చార్ బాగ్ నిర్మాణంలో కట్టినవి. సాధారణంగా ఈ గార్డెన్స్ లో సరస్సులు, ఫౌంటైన్లు, కాలువలు కూడా ఉండటం విశేషం. భారత్, పాకిస్థాన్, బంగ్లాదేశ్ లలో ఎన్నో మొఘల్ గార్డెన్స్ ఉన్నాయి. లాహోర్‌లో షాలిమర్ గార్డెన్స్, ఢాకాలో లాల్ బాగ్ కోట, శ్రీనగర్ లో షాలిమర్ గార్డెన్స్ మొఘల్ గార్డెన్స్ తరహాలో ఉన్నాయి. తాజ్ మహల్ వద్ద కూడా మొఘల్ గార్డెన్ ఉంది.

దిల్లీ మెట్రో రైళ్లలో జి20 పోస్టర్లు... చిహ్నాలు

న్యూదిల్లీ : దేశ రాజధాని దిల్లీలోని అనేక మెట్రో రైళ్ల కోచ్‌లలో భారతదేశం జి20 సంవత్సరపు అధ్యక్ష పదవిని కీర్తిస్తూ నేపథ్య పోస్టర్‌లను ఉంచారు. డీఎంఆర్‌సీ తన వ్యవస్థలోని అన్ని స్టేషన్‌లలో ప్రభావవంతమైన కూటమి జి20 చిహ్నాన్ని ప్రముఖంగా ప్రదర్శించడానికి కృషి చేస్తోంది. గత డిసెంబరు 1న జి20 అధ్యక్ష బాధ్యతలను భారత్ స్వీకరించింది. సెప్టెంబరులో దిల్లీలో జరిగే శిఖరాగ్ర సమావేశంతో ముగుస్తుంది. దేశవ్యాప్తంగా 55 ప్రదేశాలలో 200కి పైగా సమావేశాలు నిర్వహించాలని ప్రణాళిక చేశారు. అనేక ప్రభుత్వ సముదాయాలు, భవనాలు, కార్యాలయాలు ఇప్పటికే తమ ప్రాంగణంలో భారత అధ్యక్షతన జరగనున్న జి20 ఇతివృత్తమైన 'వసుధైవ కుటుంబం' లేదా 'ఒకే భూమి, ఒక కుటుంబం, ఒక భవిష్యత్తు'తో కూడిన పోస్టర్లు, బ్యానర్లు, స్టాండీలను ప్రదర్శించాయి.

ఇవే నా చివరి ఎన్నికలు: సిద్ధరామయ్య

బెంగళూరు: రాబోయే అసెంబ్లీ ఎన్నికలే తాను పోటీ చేసే చివరి ఎన్నికలని కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి, అసెంబ్లీలో కాంగ్రెస్ విపక్ష నేత సిద్ధరామయ్య సంచలన ప్రకటన చేశారు. అయితే, రాజకీయాలకు తాను దూరం కావడం లేదని స్పష్టత ఇచ్చారు. త్వరలో కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలు జరగనుండటం, కాంగ్రెస్ పార్టీలో సీఎం కుర్చీ కోసం పోటీ ఉందని బీజేపీ ఆరోపణలు చేస్తున్న నేపథ్యంలో సిద్ధరామయ్య తాజా ప్రకటన ప్రాధాన్యత సంతరించుకుంది. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలు ఈ ఏడాది మేలోపు జరగాల్సి ఉంది. 224 మంది సభ్యులున్న కర్ణాటక అసెంబ్లీ కాలపరిమితి మే 24వ తేదీతో ముగియనుంది. గత అసెంబ్లీ ఎన్నికలు 2018లో జరుగగా, కాంగ్రెస్ పొత్తుతో జనతాదళ్ సెక్యులర్ నేత హెచ్‌డీ కుమారస్వామి ముఖ్యమంత్రి అయ్యారు. కూటమి విభేదాల కారణంగా కుమారస్వామి ప్రభుత్వం పడిపోయింది. యడియూరప్ప నాయకత్వంలో కొత్త ప్రభుత్వాన్ని బీజేపీ ఏర్పాటు చేయగా, ఆ తర్వాత యడియూరప్ప స్థానంలో బసవరాజ్ బొమ్మైకి పార్టీ అధిష్ఠానం ముఖ్యమంత్రి పగ్గాలు అప్పగించింది. తాజాగా ముఖ్యమంత్రి బొమ్మై, సిద్ధరామయ్య మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. గత బడ్జెట్‌లో ప్రతిపాదించిన పన్నుల్లో 10 శాతం కూడా బొమ్మై సర్కార్ పూర్తి చేయలేదని, రాష్ట్ర రుణాలు రూ.3 లక్షల కోట్లకు చేరాయని సిద్ధరామయ్య విమర్శలు గుప్పించారు, దీనిపై బొమ్మై మండిపడ్డారు. సిద్ధరామయ్య సీఎంగా ఉన్నప్పుడు రాష్ట్రాన్ని గరిష్ఠంగా అప్పుల ఊబిలోకి నెట్టేశారని ప్రత్యారోపణలు చేశారు. కర్ణాటక చరిత్రలోనే ఒక ముఖ్యమంత్రిగా ఐదేళ్ల కాలంలో గరిష్ఠంగా రుణాలు తీసుకున్న రికార్డు సిద్ధరామయ్యదేనని ఆక్షేపించారు. మరోవైపు, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో 130 నుంచి 140 సీట్లు గెలుచుకుని బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తుందంటూ మాజీ సీఎం యడియూరప్ప చేసిన వ్యాఖ్యలను సిద్ధరామయ్య తిప్పికొట్టారు. యడియూరప్పకు బీజేపీ అధిష్ఠానం ఇప్పటికే ఒక 'పంచ్' ఇచ్చిందని, సీఎం పదవి నుంచి తొలగించిందని గుర్తు చేశారు. అలాంటి యడియూరప్పను ప్రజలు ఇంకా నమ్ముతారా? ఆయనకు మళ్లీ ఓటు వేస్తారా? అని ప్రశ్నించారు. బీజేపీ ప్రభుత్వంపై రాష్ట్ర ప్రజలు విసిగిపోయారని ఆదివారం మీడియాతో మాట్లాడుతూ సిద్ధరామయ్య అన్నారు.

'ఉగ్ర' పథకం కేసులో ముగ్గురిపై ఎన్ఐఏ కేసు

న్యూదిల్లీ: గత ఏడాది అక్టోబర్‌లో హైదరాబాద్‌లో ఉగ్రవాద దాడులకు పథకం రచించిన కేసులో అరెస్టు అయిన ముగ్గురు నిందితులపై చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం కింద జాతీయ దర్యాప్తు సంస్థ ఎన్ఐఏ కేసు నమోదు చేసింది. దసరా సమయంలో హైదరాబాద్‌లో పేలుళ్లకు పాల్పడేందుకు కుట్ర పన్నిన సూత్రధారి అబ్దుల్ జాహిద్‌కు ఉగ్రవాద సంబంధిత కేసులలో ప్రమేయం ఉందని తాజాగా నమోదు చేసిన కేసులో ఎన్ఐఏ పేర్కొంది. లష్కరే తోయిబా, పాకిస్థానీ గూఢచార సంస్థ-ఐఎస్ఐతో సంబంధాలు ఉన్నాయని, పాకిస్తాన్‌కు చెందిన హ్యాండ్లర్ల సూచనల మేరకు హైదరాబాద్‌లో పేలుళ్లకు కుట్ర పన్నినట్లు ఎన్ఐఏ వెల్లడించింది. మహ్మద్ సమీయుద్దీన్, మాజ్ హసన్, ఫరూఖ్ వంటి అనేక మంది యువకులను ఉగ్రవాద కార్యక్రమాల కోసం నియమించినట్లు ఎన్ఐఏ గుర్తించింది. జాహిద్ తన ముఠా సభ్యులతో కలిసి హైదరాబాద్‌లో పేలుళ్లు జరపడం, ఒంటరి తోడేలు తరహా దాడులు జరపాలని పాకిస్తాన్ నుంచి వచ్చిన ఆదేశాలకు అనుగుణంగా వ్యవహరించారని ఎన్ఐఏ అధికారులు వెల్లడించారు. గత ఏడాది హైదరాబాద్ సీసీఎస్‌లో నమోదైన కేసు ఆధారంగా ఎన్ఐఏ దర్యాప్తు చేపట్టింది. ప్రాథమిక ఆధారాలు లభించిన అనంతరం చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం కింద కేసు నమోదు చేయడానికి ఎన్ఐఏ కేంద్ర హోమ్ శాఖ అనుమతి కోరింది. ఈ ఏడాది జనవరి 25న కేసు నమోదు చేసి, తదుపరి దర్యాప్తు కొనసాగించడానికి కేంద్ర హోంశాఖ ఎన్ఐఏకు అనుమతి ఇచ్చింది. దర్యాప్తు సమయంలో నిందితుల నుంచి ఎన్ఐఏ అధికారులు రెండు హ్యాండ్ గ్రనేడ్‌లు, రెండు మొబైల్ ఫోన్లు, రూ.3,91,800 స్వాధీనం చేసుకున్నారు. కేసు తీవ్రత, అంతర్జాతీయ సంబంధాల నేపథ్యంలో జాతీయ దర్యాప్తు సంస్థ ఈ కేసు విచారణ చేపట్టాల్సిన ఆవశ్యకత ఉందని కేంద్ర హోంశాఖ పేర్కొంది.

బెంగాల్‌లో బాంబు దాడి

తృణమూల్ కార్యకర్త మృతి

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లోని బీర్భూమ్ జిల్లా మార్గ్రామ్‌లో బాంబు దాడి జరిగింది. ఈ ఘటనలో తృణమూల్ కాంగ్రెస్ కార్యకర్త న్యూటన్ షేక్ మరణించగా, ఆ పార్టీ పంచాయతీ అధ్యక్షుడి సోదరుడు లట్లూ షేక్ గాయపడ్డాడు. క్షతగాత్రుని స్థానిక ఎస్ఎస్‌కేఎం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటన ఇటు అధికార టీఎంసీ, విపక్ష కాంగ్రెస్ పార్టీ మధ్య చిచ్చు రేపింది. కాంగ్రెస్ మద్దతుదారులే బాంబు దాడి జరిపారని మృతుడు న్యూటన్ షేక్ బంధువులు ఆదివారం ఆరోపించగా, మార్గ్రామ్‌లో కాంగ్రెస్ పార్టీకి సంస్థాగత బలం అంతగా లేదని, తమ కార్యకర్తలు భౌతిక దాడులకు పాల్పడే అవకాశమే లేదని పశ్చిమబెంగాల్ కాంగ్రెస్ అధ్యక్షుడు అధీర్ రంజన్ చౌదరి తోసిపుచ్చారు. దాడికి పాల్పడిన వారు, బాధితులు టీఎంసీకి చెందిన వారేనని ఆయన ఆరోపించారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన లట్లూ షేక్‌ను రాష్ట్రమంత్రి ఫిర్హద్ హకీం పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఘటనపై విచారణ జరుపుతున్నామని చెప్పారు. బీర్భూమ్ జిల్లా జార్ఖండ్‌తో సరిహద్దును పంచుకుంటున్నందున ఈ ఘటనలో మావోయిస్టుల ప్రమేయం ఉందా అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు. ఈ ఘటన వెనుక కుట్ర ఉండవచ్చని అనుమానిస్తున్నామన్నారు. బాంబుల తయారీలో వాడే పదార్థాలు ఎక్కడ నుంచి వస్తున్నాయనే దానిపై దర్యాప్తు జరపాల్సి ఉంటుందన్నారు. టీఎంసీలో అంతర్గత పోరే ఈ దాడి ఘటనకు కారణమని బీజేపీ, కాంగ్రెస్ చేసిన ఆరోపణలను మంత్రి తోసిపుచ్చారు. అలాంటి అంతర్గత పోరు టీఎంసీలో లేదన్నారు.

గృహ రుణం పొదుపు కాదా?

ఆర్థిక కార్యదర్శి వ్యాఖ్యలపై చిదంబరం



న్యూదిల్లీ: గృహ రుణం పొదుపు కాదన్న తన సిద్ధాంతాన్ని పునః పరిశీలించుకోవాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, కేంద్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి పి.చిదంబరం ఆదివారం ఆర్థిక కార్యదర్శి టీవీ సోమనాథన్‌ను కోరారు. సోమనాథన్, పాత పన్ను విధానం గురించి ఒక ఆంగ్ల వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పన్ను మినహాయింపుల నిర్మాణాన్ని పరిశీలిస్తే, వాటిలో సగం పొదుపు కోసం, అలాగే మిలిగిన సగం గృహ రుణాలు లేదా గృహ రుణాలపై వడ్డీ వంటి పొదుపు కోసం అని తెలిపారు. చిదంబరం మాట్లాడుతూ ఆర్థిక కార్యదర్శి 'గృహ రుణం పొదుపుగా ఉందా?' అని అడిగారు. అతని సమాధానం 'లేదు'. ఆర్థిక కార్యదర్శితో ఎంత మంది ఏకీభవిస్తారో నేను ఆశ్చర్యపోతున్నాను' అని చిదంబరం ట్విట్టర్‌లో పేర్కొన్నారు. వడ్డీ చెల్లింపు, రుణ వాయిదాలు నిజానికి ఒక వ్యయమని, అయితే ఇది ఒక ఆస్తిగా మార్చబడిన ఖర్చు అని, ఇది పొదుపు అని మాజీ ఆర్థిక మంత్రి వాదించారు. 'మీరు అదే డబ్బును సెలవుదినం లేదా రేస్ కోర్సులో ఖర్చు పెట్టండి, చివరికి ఎటువంటి ఆస్తి ఉండదు' అని ఆయన చెప్పారు. అయితే 'గృహ రుణం పొదుపు కాదు అనే తన సిద్ధాంతాన్ని ఆర్థిక కార్యదర్శి పునః పరిశీలించాలి' అని చిదంబరం అన్నారు. ఆర్థిక కార్యదర్శి ఇంటర్వ్యూలో పేర్కొన్నట్లుగా, 'పాత పాలన పొదుపును ప్రోత్సహిస్తుందనే భావనతో నేను ఏకీభవించను. సాధారణ కారణం చెప్పాలంటే, మీరు పన్ను మినహాయింపుల నిర్మాణాన్ని పరిశీలిస్తే, వాటిలో సగం పొదుపు, గృహ రుణం లేదా గృహ రుణంపై వడ్డీ వంటి పొదుపు కోసం సగం. గృహ రుణం పొదుపుగా ఉందా?' అందువల్ల మొత్తం స్థూల ఆర్థిక ప్రభావం, ఇది పొదుపు పుష్ కాదు కానీ కేవలం కొన్ని విషయాల వైపు నెట్టడం మాత్రమే. మీరు గృహ నిర్మాణం, బీమా లేదా పింఛను చేయాలని ప్రభుత్వం కోరుతోంది. కానీ ఇది తప్పనిసరిగా పొదుపు వైపు లేదా దేశంలో పొదుపు రేటును ప్రభావితం చేయదు' అని ఆయన చెప్పారు.

నేడు మేయర్ ఎన్నిక జరిగేనా?

ఇప్పటికే రెండుసార్లు మేయర్ ఎన్నిక వాయిదా

న్యూదిల్లీ : దిల్లీ మునిసిపల్ కౌన్సిల్ సోమవారం సమావేశం కానున్నది. గత రెండుసార్లు ఎన్నికలను పూర్తి చేయడంలో విఫలమైన తర్వాత నగరానికి మేయర్‌ను ఎన్నుకోవడానికి సమావేశమవుతుంది. డీఎంసీ చట్టం 1957 ప్రకారం, పౌర ఎన్నికల తర్వాత సమావేశమయ్యే మొదటి సభలోనే మేయర్, డిప్యూటీ మేయర్‌లను ఎన్నుకోవాలి. అయితే, మునిసిపల్ ఎన్నికలు జరిగి రెండు నెలలు కావస్తున్నా, దిల్లీకి మేయర్ పదవి దక్కలేదు. జనవరి 6, జనవరి 24న జరిగిన మొదటి రెండు సమావేశాలు... బీజేపీ, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) సభ్యుల మధ్య వాగ్వాదం కారణంగా మేయర్‌ను ఎన్నుకోకుండానే ప్రిసైడింగ్ అధికారి వాయిదా వేశారు. అయితే డిసెంబరు 4న జరిగిన పోలింగ్ తర్వాత 250 మంది సభ్యులున్న సభలో మొదటి సమావేశం పూర్తిగా ఫలించగా, రెండవ సమావేశంలో నామినేటెడ్ సభ్యులు, ఎన్నికయిన సభ్యులు ప్రమాణం చేశారు. ప్రమాణ స్వీకార కార్యక్రమం తర్వాత, మునిసిపల్ కౌన్సిల్‌ను ప్రిసైడింగ్ అధికారి, బీజేపీ కౌన్సిలర్ సత్య శర్మ తదుపరి తేదీకి వాయిదా వేశారు. ఆప్, అరవింద్ కేజ్రీవాల్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ బీజేపీ సభ్యులు ఛాంబర్ నుంచి వాకౌట్ చేయగా, ఆప్ సభ్యులు దాదాపు ఐదు గంటలపాటు సభలో శాంతియుతంగా నిరసన తెలిపారు. రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్ సహా ఆప్ సీనియర్ నాయకులు సభ నుంచి బయటకు వచ్చిన తర్వాత విలేకరులతో మాట్లాడుతూ మేయర్ ఎన్నిక జరగడానికి అనుమతించకపోవడం ద్వారా బీజేపీ 'ప్రజాస్వామ్యాన్ని ఉక్కిరిబిక్కిరి చేసింది. ప్రమాదకరమైన పనిని ప్రారంభించింది' అని అన్నారు. మేయర్, డిప్యూటీ మేయర్, ఆరుగురు స్టాండింగ్ కమిటీ సభ్యుల ఎన్నికలను త్వరగా నిర్వహించాలని ఆప్ నాయకుడు, పార్టీ ఎమ్మెల్యే అతిషి లెఫ్టినెంట్ గవర్నర్ వి.కె.సక్సేనాకు విజ్ఞప్తి చేశారు. ఆ తర్వాత, మేయర్ ఎన్నికల నిర్వహణలో జాప్యంపై ఆప్ మేయర్ అభ్యర్థి షెల్లీ ఒబెరాయ్ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఇప్పుడు, మేయర్‌ను ఎన్నుకోవడం కోసం కౌన్సిల్ మూడవ సమావేశం సోమవారం జరగనుంది. డిసెంబరు 4న పౌర ఎన్నికలు నిర్వహించగా, డిసెంబరు 7న ఓట్ల లెక్కింపు జరిగింది. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఎన్నికలలో స్పష్టమైన విజేతగా నిలిచింది. 134 వార్డులను కైవసం చేసుకొని పౌర సంస్థలో బీజేపీ 15 సంవత్సరాల పాలనకు ముగింపు పలికింది. అయితే బీజేపీ 104 వార్డుల్లో విజయం సాధించి రెండవ స్థానంలో నిలిచింది.

నేడు సుప్రీం నూతన న్యాయమూర్తుల ప్రమాణం

న్యూదిల్లీ: సుప్రీంకోర్టుకు నియమితులైన ఐదుగురు నూతన న్యాయమూర్తులు ఫిబ్రవరి 6న ప్రమాణ స్వీకారం చేయనున్నారు. వీరి చేరికతో సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య 32కి చేరనుంది.

ఈ న్యాయమూర్తుల పేర్లను గతేడాది డిసెంబర్ 13న సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేయగా శనివారం కేంద్రప్రభుత్వం ఆమోదం తెలిపింది. కొత్తగా నియమితులైన న్యాయమూర్తుల వివరాలు...

జస్టిస్ పంకజ్ మిట్టల్.. ప్రస్తుతం జస్టిస్ పంకజ్ మిట్టల్ రాజస్థాన్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్నారు. దీనికి ముందు జమ్ముకశ్మీర్, లడఖ్ హైకోర్టులకు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు. ప్రధాన న్యాయమూర్తిగా పదోన్నతికిముందు అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేశారు. 1985లో ఉత్తరప్రదేశ్ బార్ కౌన్సిల్‌లో చేరారు.

జస్టిస్ సంజయ్ కరోల్...నవంబర్ 2019 నుంచి పాట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్నారు. గతంలో ఆయన త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యారు. హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా కూడా నియమితులయ్యారు. 1986 లో న్యాయవాదిగా నమోదు చేసుకున్నారు.

జస్టిస్ పివి సంజయ్ కుమార్... 2021 సంవత్సరం నుంచి మణిపూర్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి. అంతకు ముందు పంజాబ్, హరియాణా హైకోర్టులో ,ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో న్యాయమూర్తిగా పనిచేశారు. ఆగస్టు 1988లో బార్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌లో సభ్యునిగా నమోదు చేసుకున్నారు.

జస్టిస్ అహ్సనుద్దీన్ అమానుల్లా... ప్రస్తుతం పాట్నా హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్నారు. 2011లో పాట్నా హైకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొంది.. 2021లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు బదిలీ అయ్యారు. ఆ తర్వాత జూన్ 2022లో పాట్నా హైకోర్టుకు బదిలీ అయ్యారు. సెప్టెంబర్ 1991లో బీహార్ రాష్ట్ర బార్ కౌన్సిల్‌లో నమోదు చేసుకున్నారు.

జస్టిస్ మనోజ్ మిశ్రా... ప్రస్తుతం అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్నారు. 2011లో న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేశారు. డిసెంబరు 12, 1988న న్యాయవాదిగా నమోదు చేసుకున్నారు.

అదానీ గ్రూప్‌తో మోదీ సర్కార్ కుమ్మక్కు: కాంగ్రెస్

న్యూదిల్లీ: అదానీ గ్రూపు అతిపెద్ద ఆర్థిక కుంభకోణానికి సంబంధించి కాంగ్రెస్ పార్టీ కేంద్రంలోని మోదీ సర్కారుపై దాడిని మరింత ఉధృతం చేసింది. ఈ సమస్యపై మోదీ ప్రభుత్వం మౌనముద్ర దాల్చడం చూస్తుంటే ఈ కుంభకోణంలో కుమ్మక్కయిందని స్పష్టమవుతోందని విమర్శించింది. గౌతమ్ అదానీ నేతృత్వంలోని గ్రూప్‌లో మోసపూరిత ఆర్థిక లావాదేవీలు, షేర్ ధర మాయాజాలాన్ని అమెరికాకు చెందిన హిండెన్‌బర్గ్ రీసెర్చ్ సంస్థ బట్టబయలు చేయడంతో స్టాక్‌మార్కెట్లలో అదానీ గ్రూప్ కంపెనీల షేర్ల విలువ అమాంతం పడిపోయిన సంగతి తెలిసిందే. ఈ అంశంపై ప్రధాని నరేంద్ర మోదీకి ఆదివారం నుంచి రోజుకు మూడు ప్రశ్నలు సంధిస్తామని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి (కమ్యూనికేషన్స్) జైరాం రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. అదానీ గ్రూప్ అవినీతి బాగోతం బయటకొస్తున్న నేపథ్యంలో మోదీ ప్రభుత్వం అటకెక్కిందని ఆయన అన్నారు. సెప్టెంబర్ 05 2016లో చైనాలోని హాంగ్‌జౌలో జరిగిన జి20 శిఖరాగ్ర సమావేశంలో మోదీ మాట్లాడుతూ... ఆర్థిక నేరస్థులు విదేశాల్లో తలదాచుకోకుండా ఎక్కడికక్కడ మనీలాండరింగ్ చేసేవారిని గుర్తించి, బేషరతుగా అప్పగించాలి... అవినీతిపరులను, వారి కార్యకలాపాలను గోప్యంగా ఉంచే సంక్లిష్ట అంతర్జాతీయ నిబంధనలు, మితిమీరిన బ్యాంకింగ్ గోప్యతను విచ్ఛిన్నం చేయడానికి చర్యలు తీసుకోవాలని ప్రపంచ దేశాలను కోరారని గుర్తు చేశారు. ఈ సూక్తులు అదానీ విషయంలో ఎందుకు వర్తించవని ప్రశ్నించారు. బహామాస్, బ్రిటిష్ వర్జిన్ దీవులలో ఆఫ్‌షోర్ ఎంటిటీలను నిర్వహిస్తున్న వ్యక్తిగా పనామా పేపర్స్, పండోర పేపర్లలో గౌతమ్ అదానీ సోదరుడు వినోద్ అదానీ పేరు ఉందని రమేశ్ అన్నారు. రాజకీయ ప్రత్యర్థులను బెదిరించేందుకు, తనకు అనుగుణంగా లేని వ్యాపార సంస్థలను శిక్షించేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్, డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ వంటి ఏజెన్సీలను ప్రధాని మోదీ సంవత్సరాలుగా దుర్వినియోగం చేశారని రమేష్ విమర్శించారు. అదానీ గ్రూప్‌పై ఏళ్ల తరబడి వచ్చిన తీవ్ర ఆరోపణలపై విచారణ జరిపేందుకు తీసుకున్న చర్యలు ఏంటని, ప్రధాని ఆధ్వర్యంలో ఈ వ్యవహారంలో న్యాయమైన, నిష్పక్షపాతంగా దర్యాప్తు జరుగుతుందన్న ఆశ ఏమైనా ఉందా అని రమేశ్ ప్రశ్నించారు. 'ఎయిర్‌పోర్ట్‌లు, ఓడరేవులలో గుత్తాధిపత్యాన్ని నిర్మించడానికి మోదీ సర్కారు అనుమతించిన భారతదేశంలోని అతిపెద్ద వ్యాపార సమూహాలలో అదానీ గ్రూప్ ఒకటి. నిరంతర ఆరోపణలు ఉన్నప్పటికీ ఎంతకాలం తీవ్రమైన పరిశీలన, దర్యాప్తు నుంచి తప్పించుకోవడం ఎలా సాధ్యమవుతుంది?' అని రమేశ్ అన్నారు.

లలితాదేవి త్యాగాల స్ఫూర్తితో ఉద్యమాలు

25వ వర్ధంతి సభలో సీపీఐ నేతల నివాళి

విశాలాంధ్ర-విజయవాడ: భారత కమ్యూనిస్టు పార్టీ తొలితరం నేత మోదుమూడి లలితాదేవి, శ్రీహరిరావు దంపతుల త్యాగాల ప్రేరణతో కమ్యూనిస్టు ఉద్యమాన్ని ముందుకు కొనసాగించాలని సీపీఐ అగ్రనాయకులు అన్నారు. సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి సీహెచ్.కోటేశ్వరరావు అధ్యక్షతన లలితాదేవి 25వ వర్ధంతి సభ విజయవాడ ప్రెస్ క్లబ్‌లో ఆదివారం జరిగింది. పార్టీ సీనియర్ నాయకులు ఈడ్పుగంటి నాగేశ్వరరావు మాట్లాడుతూ జాతీయోద్యమ కాలంలో చారిత్రక ప్రాశస్త్యం గల బందరులో కమ్యూనిస్టు పార్టీని అభివృద్ధి చేసి... పార్టీకి, విశాలాంధ్ర పత్రికకు చిరునామాగా నిలబెట్టిన ఘనత శ్రీహరిరావు, లలితాదేవి దంపతులకే చెందుతుందని, వారిద్దరిని విడిగా చూడలేమన్నారు. దివి తాలూకా నుంచి బందరు వచ్చి బలంగా ఉన్న కాంగ్రెస్ పార్టీకి ఎదురొడ్డి, సోషలిస్టు భావాలతో కమ్యూనిస్టు పార్టీని అభివృద్ధి చేశారని తెలిపారు. లలితాదేవి ఎక్కడకు వెళ్లినా పార్టీని నిర్మించార న్నారు. అన్ని కమ్యూనిస్టు పార్టీలలో ఉన్న అగ్ర నాయకులు శ్రీహరిరావు, లలితాదేవి దంపతుల త్యాగాలను కొనియాడతారని చెప్పారు. 1950లో రాష్ట్రంలో కమ్యూనిస్టు పార్టీకి 41 ఎమ్మెల్యే స్థానాలు వచ్చాయ న్నారు. ప్రస్తుతం అంతర్జాతీయంగా కమ్యూనిస్టు పార్టీకి ఒడుదుడుకులు వస్తున్నాయన్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థకు కమ్యూనిస్టు, సోషలిస్టు ఉద్యమాలే ప్రత్యామ్నాయంగా ఉంటాయని తెలిపారు.

లలితాదేవి త్యాగాల వల్లే తరాలు మారుతున్నా నేటికీ ఆమెను స్మరించుకుంటు న్నామన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ సంపద, పదవులు ఉన్నా జీవితంలో అనుభవించిన కష్టాలు, త్యాగాలు వృథా పోవు అనటానికి లలితాదేవి జీవితం ఉదాహరణ అన్నారు. సంపన్న బ్రాహ్మణ కుటుంబంలో జన్మించినా కమ్యూనిస్టు ఉద్యమంలో పని చేయటం ద్వారా ఆమె ధన్యజీవిగా చరిత్రలో నిలిచిపోయారని కొనియాడారు. పార్టీ కోసం చేసిన త్యాగాలను కమ్యూనిస్టు పార్టీలు మరిచిపోవని చెప్పారు. వారి త్యాగాలకు గుర్తుగా పార్టీని ముందుకు తీసుకువెళ్లాలని సూచించారు. భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర సమితి తరపున నివాళు లర్పించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మాట్లాడుతూ పోలీసులు, ప్రభుత్వాల దమనకాండ పరిస్థితుల్లో కమ్యూనిస్టు పార్టీకి గౌరవనీయమైన స్థానం నిలబెట్టేందుకు శ్రీహరిరావు, లలితాదేవి కృషి చేశారని కొనియాడారు. చల్లపల్లి రాజా మిగులు భూముల ఉద్యమం చేపట్టి విజయం సాధించారన్నారు. జిల్లాలో అనేక చోట్ల భూపోరాటాలు నిర్వహించి 5 వేల మంది పేదలకు పట్టాలు ఇప్పించారని గుర్తుచేశారు. కమ్యూనిస్టు పార్టీ నైతిక విలువలతో కొనసాగేటట్లు చేశారన్నారు. నాలుగు తరాలు సంప్రదాయాన్ని కొనసాగించటం అభినందనీయమ న్నారు. లలితాదేవి కుటుంబంతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం తరపున నివాళులర్పించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు అక్కినేని వనజ మాట్లాడుతూ లలితాదేవి సాధారణ మహిళగా ఆలోచించకుండా సహచరిణిగా సహకారం అందించిన కారణంగానే ఆమెను ఇప్పటికీ స్మరించుకుంటున్నామ న్నారు. మహిళల క్రియాశీల పాత్ర వల్లే ఉద్యమాలు నిలబడతాయన్నారు. కుటుంబ విలువల్ని కాపాడుకుం టూనే ఎర్రజెండాని నిలబెట్టారని కొనియాడారు. దేశానికి నేడు కమ్యూనిస్టుల పాత్ర అవసరం ఉందన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ లలితాదేవి త్యాగాలను స్మరించుకోవటమే కాకుండా వారు నమ్మిన సిద్ధాంతాలను ముందుకు తీసుకెళ్లాలన్నారు. విశాలాంధ్ర, కమ్యూనిజం పత్రికలు చదవాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తరపున నివాళులర్పించారు. విశాలాంధ్ర ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ కూన అజయ్‌బాబు మాట్లాడుతూ లలితాదేవి కారణంగానే ఆమె పిల్లలందరూ కమ్యూనిస్టు పార్టీలో కొనసాగుతున్నారని చెప్పారు. లలితాదేవి కుమారుడు వాసు, అల్లుడు కృష్ణమూర్తి ఆమె త్యాగాలను వివరించారు. మహిళా సమాఖ్య రాష్ట్ర నాయకులు పి.రాణి, కృష్ణాజిల్లా రైతు సంఘం నాయకులు వెలగపూడి ఆజాద్ లలితాదేవి త్యాగాలను కొనియాడారు. సీహెచ్ కోటేశ్వరరావు మాట్లాడుతూ ఉన్నత కుటుంబంలో జన్మించి, చివరికి పేదరికం అనుభవించినా కమ్యూనిస్టు ఉద్యమాలకు స్ఫూర్తిగా నిలిచారని చెప్పారు. సీపీఐ కృష్ణాజిల్లా ఇన్‌చార్జి కార్యదర్శి టి.తాతాయ్య మాట్లాడుతూ శ్రీహరిరావు, లలితాదేవి జీవిత విశేషాలను పుస్తకం రూపంలో తీసుకురావాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు చంద్రానాయక్, కోశాధికారి ఆర్.పిచ్చయ్య అభ్యుదయ గీతాలు ఆలపించి నివాళులర్పించారు. సభకు హాజరైన నాయకులు ముందుగా లలితాదేవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. లలితాదేవి కుటుంబం నాలుగో తరానికి చెందిన మునిమనువలు, చిన్నారులు సభకు హాజరైన అతిథులకు జ్ఞాపికలు అందించి ముద్దుముద్దు మాటలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమాన్ని లలితాదేవి కుమారుడు మోదుమూడి మురళీకృష్ణ, లక్ష్మీరాజ్యం దంపతులు పర్యవేక్షించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దోనేపూడి శంకర్, సీనియర్ నాయకులు వై.చెంచయ్య, సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, మచిలీపట్నం నియోజకవర్గ కార్యదర్శి ఫిలిప్, కమ్యూనిస్టు పార్టీ నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు, విశాలాంధ్ర సిబ్బంది పాల్గొన్నారు.

ముషారఫ్‌పై శశి థరూర్ ప్రశంసలు

న్యూదిల్లీ: పాకిస్తాన్ మాజీ అధ్యక్షుడు జనరల్ పర్వేజ్ ముషారఫ్‌ను ప్రశంసల్లో ముంచెత్తిన కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్‌పై బీజేపీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ముషారఫ్ కార్గిల్ యుద్ధానికి కారకుడయ్యారని, అల్‌ఖైదా ఉగ్రవాద సంస్థ చీఫ్ ఒసామా బిన్ లాడెన్‌ను కొనియాడారని గుర్తు చేసింది. ముషారఫ్ మృతిపై శశి థరూర్ ట్విటర్ వేదికగా స్పందిస్తూ పాకిస్తాన్ మాజీ అధ్యక్షుడు అరుదైన వ్యాధితో మరణించారని తెలిపారు. ఆయన ఒకప్పుడు భారత దేశానికి రాజీలేని శత్రువు అని, అయితే 2002-2007 మధ్య కాలంలో నిజమైన శాంతికాముకుడిగా మారారని చెప్పారు. ఆ రోజుల్లో తాను ఐక్యరాజ్య సమితిలో ఆయనను ప్రతి సంవత్సరం కలిసేవాడినన్నారు. ఆయన చాలా తెలివైనవారని, కలుపుగోలుగా ఉంటారని, వ్యూహాత్మక ఆలోచనలో స్పష్టంగా ఉంటారని, ఆయన ఆత్మకు శాంతి కలగాలని

బీజేపీ మండిపాటు

ఆకాంక్షిస్తున్నానని పేర్కొన్నారు. దీనిపై బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా ట్విటర్ వేదికగా స్పందిస్తూ, ఈ కాంగ్రెస్ పార్టీ బాలాకోట్ దాడుల విషయంలో భారత సైన్యాన్ని అనుమానించిందని, బిన్ లాడెన్‌ను పొగిడిందని, భారత సైన్యాధిపతిని రోడ్డు మీద గూండా అని వ్యాఖ్యానించిందని, ఇప్పుడు ముషారఫ్‌ను ప్రశంసిస్తోందని దుయ్యబట్టారు. ముషారఫ్ గతంలో రాహుల్ గాంధీని జెంటిల్మన్ అని పొగిడారని గుర్తు చేశారు. లాడెన్‌ను, తాలిబన్‌ను పొగిడిన ముషారఫ్ రాహుల్ గాంధీని కూడా ప్రశంసించారని గుర్తు చేశారు. కార్గిల్ యుద్ధానికి కారకుడైన, ఉగ్రవాదాన్ని బలపరచిన ముషారఫ్‌ను శశి థరూర్ పొగడటానికి ఇదే కారణమై ఉంటుందని చెప్పారు.

'పాడుదుమా స్వేచ్ఛాగీతం'

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో

- రచయిత గంటేడ గౌరునాయుడుకు అభినందనల వెల్లువ
- రచయితలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల హర్షం

విశాలాంధ్ర-పార్వతీపురం: "పాడుదమా స్వేచ్ఛాగీతం... ఎగరేయుదమా జాతిపతాకం... దిగంతాల నినదించి..విశ్వవిఖ్యాతి నొందగా జాతిగౌరవం"అనే దేశభక్తి గీతానికి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు లభించింది. దీంతో మన్యం జిల్లా రచయితలు, స్నేహకళాసాహితీ, వివిధ సాహిత్య సంస్థలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శనివారం ఏలూరు జిల్లా సీఆర్ రెడ్డి పబ్లిక్ స్కూల్ మైదానంలో హేలాపూరి బాలోత్సవంఎమ్మెల్సీ షేక్ షాబ్జి, జిల్లా రెవెన్యూ అధికారి సత్యనారాయణ, నిర్వాహకులు ఆలపాటి నాగేశ్వరరావు, గరికపాటి నర్సింహారావు తదితరుల అధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఈ దేశభక్తి గీతాన్ని ఒకేసారి వేయిమంది ఆలపించారు. దీంతో 'తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్'లో నమోదు చేసి ప్రశంసా పత్రం, మెడల్ ప్రకటించారు.

ఈ దేశభక్తి గీతం రచయిత గంటేడ గౌరునాయుడు పార్వతీపురం వాసులు. అక్కడే ఉంటున్న ఆయనను విశాలాంధ్ర ప్రతినిధులు కలిసి అభినందలు తెలిపారు. ఈ కార్యక్రమానికి తనను కూడా ఆహ్వానించారని గౌరునాయుడు తెలిపారు. ఉత్సవంలో పాల్గొనేందుకు వెళ్లాలని ఉన్నా... స్నేహ కళా సాహితీ మిత్రులు వారి వారి పనుల్లో నిమగ్నమవడంతో కుదరలేదని ఆయన తెలిపారు. అనంతరం ఈ దేశభక్తి గీతం రాసేందుకు తన స్ఫూర్తినిచ్చిన విషయాన్ని విశాలాంధ్రతో పంచుకున్నారు.

ఈ గీతాన్ని తనచేత రాయించింది పిల్లలేనన్నారు. ముప్పయ్యేళ్ల కిందట గుమ్మలక్ష్మీ పురం మండలంలో, మన్యం ప్రాంతమైన రేగడి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో పనిచేస్తుండగా, అక్కడి బాలికలు అడిగి మరీ ఈ గేయం రాయించుకు న్నారని గుర్తు చేసుకున్నారు. 'మేస్టారూ... రిపబ్లిక్ డే వస్తోంది కదా... మాకు కొత్తపాట చెబుతామన్నారు. ఏదీ... ఇప్పుడే నేర్పించండి' అంటూ ఆ పిల్లలు పట్టుబట్టారు. అలా అడిగిన ఆ పిల్లల్లో 'భారతి' ముఖం బాగా గుర్తు. సరే అని పాఠశాల చివరి గంట అయ్యాక బడి తోటలో పూల మొక్కల మధ్య, పువ్వులాంటి ఆ పిల్లల మధ్య కూర్చుని ఈ పాట రాశాను. బస్సు గొరడవెళ్లి తిరిగి వచ్చే లోగా పాటను రాసి పిల్లలకు నేర్పించాను' అని గుర్తు చేసుకున్నారు.

ఎంతోమంది 'భారతి'లు

ఈపాట నా చేత రాయించిన చురకైన కళ్ల అమ్మాయి భారతి పదోతరగతి పాసయ్యాక ఇంట్లో వారు ఇంటర్ చదవించలేక పెళ్లి చేశారని తెలిసింది. అనంతరం కొన్నేళ్లు పోయాక ఏడాది పిల్లాడ్ని చంకనేసుకుని నా ఇంటికి వచ్చింది. 'మిమ్మల్ని చూడాలనిపించి వచ్చేనండి' అని ఆరోజు మా ఇంట్లో మాతో గడిపింది. 'మా ఆడపిల్లల పరిస్థితి ఇంతే మాస్టారూ... మీరు చెప్పినట్టు చదవలేకపోయా. ఎంత మొరపెట్టుకున్నా... నా మాట వినలేదు మా వాళ్లు. పెళ్లొద్దన్నందుకు నాన్నచేత దెబ్బలు, పెళ్లయ్యాక మొగుడి చేత తాపులు... ఇదిగో... ఇప్పుడిలా ఉన్నాను' అని చంకలో ఉన్న బాబును చూపిస్తూ కన్నీళ్లు పెట్టుకుంది. 'మా ఆయన తాగొచ్చి కొడతాడు. ఇంట్లో చెప్పినా పట్టించుకోరు... నా చావు నన్ను చావమన్నారు. మా ఆడపిల్లలు ఇలా చావాల్సిందే' అంటూ బోరున ఏడ్చింది. బడిలో ఎంత హుషారుగా ఉండేదో ఈ పిల్ల. ఓదార్చి, ధైర్యం చెప్పా. బాబు చేత నా కాళ్లకు మొక్కించి, కన్నీళ్లతో వెళ్లిపోయింది. అలా వెళ్లిన భారతి మళ్లీ నాకు కనిపించలేదు. తరువాత ఎప్పుడో తెలిసింది... ఇక కనిపించదని' అంటూ గంటేడ మాస్టారూ భావోద్వేగానికి గురయ్యారు. నేడు ఈ పాట మూడువేలమంది పాడగా విన్నాను. వారిలో భారతి లేకపోవచ్చు కానీ, పాత జ్ఞాపకాలు మాత్రం గుర్తొస్తున్నాయి. ఆమె చివరిసారి చేసిన కన్నీటి నమస్కారం మసకమసగ్గా కనిపిస్తూ గుండె బరువెక్కుతోంది. నిజంగా... ఆడపిల్లలు స్వేచ్ఛా గీతాలై విహరించే రోజు వస్తుందా? అని ఆవేదన వ్యక్తం చేశారు.

అఖండమైన ప్రజాదరణ

ఆయన రాసిన ఈ దేశభక్తి గీతం నేడు ఉభయ రాష్ట్రాల్లోని అన్ని విద్యా సంస్థల్లో ప్రార్థన గీతంగా, దేశభక్తి గీతంగా ఆలపించడం గర్వించదగ్గ విషయం. ఇంకో విశేషమే మిటంటే ఇదే గీతాన్ని 2022లో మహారాష్ట్ర ప్రభుత్వం 9వ తరగతిలో మొదటి పాఠ్యాం శంగా చేర్చి ఆయన జీవితాన్ని కూడా పరిచయం చేసింది. అటువంటి ఉత్తమ కథా రచయత మన మన్యం జిల్లాకు చెందిన వాడు కావడం ఎంతో గర్వకారణం. కథ, కవిత్వం, పాట, పద్యం... అన్ని ప్రక్రియల్నీ సమర్థవం తంగా నిర్వహించగలిగిన గంటేడ గౌరు నాయుడు మాస్టారు మన్యం జిల్లాలోని కొమరాడ మండలం దళాయిపేట గ్రామంలో సోములమ్మ, సత్యం నాయుడు దంపతుల మొదటి సంతానం. గిరిజన సంక్షేమ శాఖలో మూడు దశాబ్దాల పాటు ఉపాధ్యాయునిగా సేవలు అందించి ప్రస్తుతం మన్యం జిల్లాలో విశ్రాంత జీవితాన్ని గడుపుతూ, సాహిత్య అభివృద్ధికీ నిరంతరం కృషి చేస్తు న్నారు. ఈయనలో మంచి చిత్రకారుడు కూడా దాగున్నాడు. కురుపాంలో 'స్నేహ కళాసాహితీ'ని స్థాపించి ఉత్తరాంధ్ర నుంచి ఎందరో కవుల్నీ, కథకుల్నీ తయారు చేసిన ఘనత మాస్టారుదే.

సజీవ కథలకు కేరాఫ్

గౌరునాయుడు గ్రామీణ కథకుడు. జానపద కథకుడు. మంచిని, మానవత్వాన్ని ప్రేమించినవాడు. తనచుట్టూ ఉండే తనవారి జీవన పోరాటాలను కథలుగా, కవితలుగా రాస్తారు. ప్రపంచీకరణ ప్రభావంతో అన్ని పల్లెల్లాగే ఉత్తరాంధ్ర పల్లె తన సహజత్వాన్నీ కోల్పోయింది. పల్లెల్లోకి పెట్టుబడిదారుడు పాదం మోపాక వ్యవసాయం వ్యాపారంగా మారింది. రైతు తన పొలంలో తానే ఒక కూలీగా మారిపోయాడు. ఈ మార్పుల్నీ ఎప్పటికప్పుడు తన కథల్లో సజీవంగా చిత్రిస్తున్న రచయిత గౌరునాయుడు. ఎన్నో ఏళ్లుగా రాస్తున్న రచనలను కురుపాం స్నేహ కళాసాహితీ ప్రచురణ చేస్తోంది. ఆయనకు ఎన్నో పురస్కారాలు, ఎన్నో అవార్డులు, రివార్డులు రావడం గమనార్హం. హంగులూ ఆర్భాటాలు లేకుండా సాధారణ వ్యక్తిగా ఉండటానికే గౌరునాయుడు ఇష్టపడతారు. ఆయన సాహిత్యంపై ఇప్పటికే ఆంధ్రా యూనివర్సిటీ, తెలుగు విశ్వ విద్యాలయం, కేంద్రీయ విశ్వవిద్యాలయం, పద్మావతి మహిళ విశ్వ విద్యాలయానికి చెందిన నలుగురు పరిశోధనలు పూర్తి చేయగా, ద్రవిడ విశ్వ విద్యాలయం నుంచి ఒకరు, ఆంధ్రా విశ్వవిద్యాలయం నుంచి మరో ఇద్దరు పరిశోధనలు చేస్తున్నారు.

వెట్రిమారన్‌తో ఎన్‌టీఆర్ చిత్రం?

హైదరాబాద్: ఏ పాత్ర అయినా అలవోకగా పోషించే నటుడు జూనియర్ ఎన్టీఆర్. డైలాగ్స్‌ను చెప్పడంలోను, అభినయించడంలోను తారక్‌కు ఎవరు సాటిరారు. ఆయన చివరగా 'ఆర్ఆర్ఆర్'లో నటించారు. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించింది. తారక్ నటనకు కూడా అభిమానుల మెప్పుతో పాటు విమర్శ కుల ప్రశంసలు దక్కాయి. 'ఆర్ఆర్ఆర్'తో తారక్‌పై

అంచనాలు అమాంతం పెరిగి పోయాయి. అందువల్ల తన నుంచి వచ్చే ప్రాజెక్టులన్ని పాన్ ఇండియా రేంజ్‌లో ఉండాలని ఆచితూచి అడుగులేస్తు న్నారు. అయితే, జూనియర్ ఎన్టీఆర్‌కు సంబంధించిన ఓ అప్‌డేట్ కోలీవుడ్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. అదేంటంటే.. కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ వెట్రిమారన్‌తో ఎన్టీఆర్ సినిమా చేయనున్నారని తెలుస్తోంది. తారక్‌కు ఆయన మూడు కథలు వినిపించారని సమాచారం. ఎన్టీఆర్ ఒక్క స్క్రిప్ట్‌ను ఎంపిక చేసుకున్నారని రూమర్స్ హల్‌చల్ చేస్తున్నాయి. ఈ చిత్రం రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు రాబోతుందట. మొదటి పార్ట్‌లో ఎన్టీఆర్ నటిస్తే, రెండో పార్ట్‌లో ధనుష్ నటించనున్నారని వదంతులు షికార్లు కొడుతున్నాయి. సమాజం లోని అసమానతలనే వెండితెరపై చూపిస్తారని వెట్రిమారన్‌కు మంచి పేరుంది. 'విసారణై', 'అసురన్', 'వడ చెన్నై' చిత్రాలన్ని ఆ కోవకు చెందినవే. ఈ సినిమాలతో వెట్రిమారన్ తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. ఆయన ప్రస్తుతం సూర్యతో 'వడి వాసల్' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ మూవీ షూటింగ్ పూర్తి కాగానే జూనియర్ ఎన్టీఆర్ ప్రాజెక్టుపై దృష్టి సారించనున్నట్టు సమాచారం.

డైరెక్టర్ సుధా కొంగరకు గాయం

చెన్నై: దర్శకురాలు సుధా కొంగర గాయపడ్డారు. ఈ విషయాన్ని ఆమె ట్విట్టర్ వేదికగా అభిమానులకు తెలియచేశారు. 'ఆకాశమే నీ హద్దురా' సినిమాతో దర్శకురాలిగా గుర్తింపు తెచ్చుకున్నారు సుధా కొంగర. సూర్య హీరోగా తెరకెక్కిన ఈ సినిమా మంచి విజయాన్ని సాధించి ఆమె ప్రతిభను ప్రపంచానికి చాటిచెప్పింది. తాజాగా ఆమె గాయపడ్డారు. చేతికట్టుతో ఉన్న ఫొటోలను షేర్ చేసిన సుధా.. చాలా చిరాకుగా, బాధగా ఉందని తెలిపారు. దెబ్బ కారణంగా నెలరోజులు షూటింగ్ నుంచి విరామం తీసుకోవాల్సి వచ్చిందని చెప్పారు. తాను ఇలా షూటింగ్ నుంచి బ్రేక్ తీసుకోవల్సి వస్తుందని ఎప్పుడూ అనుకోలేదన్నారు. ఈ విషయం తెలిసిన నెటిజన్లు, సినీ ప్రముఖులు ఆమె త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నారు. ప్రస్తుతం సుధా బాలీవుడ్ హీరో అక్షయ్ కుమార్‌తో ఓ సినిమా చేస్తున్నారు. తెలుగులో 'ఆకాశమే నీ హద్దురా' పేరుతో విడుదలైన సినిమాను హిందీలో తెరకెక్కిస్తున్నారు. ఇదిలా ఉండగా, ఆమె ప్రముఖ పారిశ్రామిక వేత్త రతన్ టాటా బయోపిక్ తెరకెక్కించనున్నారని ఇటీవల పలు వార్తలు వచ్చాయి. వాటిపై ఆమె స్పందిస్తూ.. ప్రస్తుతానికి ఆయన బయోపిక్ తెరకెక్కించే ఆలోచన లేదని స్పష్టం చేసిన విషయం తెలిసిందే.

త్వరలో మరో మెగా హీరోతో సినిమా: బాబీ



హైదరాబాద్: 'వాల్తేరు వీరయ్య' సినిమాతో అద్భుతమైన విజయాన్ని అందుకు న్నాడు దర్శకుడు బాబీ. చిరు అభిమాలనుకు మాస్ ఎంటర్‌టైనర్‌ను అందించిన ఈ డైరెక్టర్ ప్రస్తుతం ఆ సక్సెస్‌ను ఎంజాయ్ చేస్తున్నారు. తాజాగా గన్నవరం విమానా శ్రయంలో సందడి చేసిన బాబీ మీడియాతో మాట్లాడారు. 'వాల్తేరు వీరయ్య' సినిమాని హిట్ చేసినందుకు మరోసారి ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు. 'మా సినిమా విడుదలై నాలుగు వారాలవుతున్నా.. ఇప్పటికీ కలెక్షన్‌లు బాగా వస్తున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రజలతో పాటు విదేశాల్లోని తెలుగు వారు ఈ సినిమాను బాగా ఆదరిస్తున్నారు. నా దర్శకత్వంలో నటించడానికి చిరంజీవి అంగీకరించడం నాకు పెద్ద బహుమతితో సమానం. ప్రస్తుతం మా చిత్రబృందమంతా సినిమా విజయోత్సవ సంబరాల్లో ఉంది. మెగా హీరోతో మరో సినిమా చేస్తున్నాను. త్వరలోనే దానికి సంబంధించిన వివరాలను అధికారికంగా వెల్లడిస్తాను' అని చెప్పారు. ఇక పవన్‌కల్యాణ్ గురించి బాబీ మాట్లడుతూ తన మద్దతు ఎప్పటికీ ఆయనకు ఉంటుందని ప్రకటించారు. ప్రస్తుతం ఈ వార్త హాట్ టాపిక్‌గా మారింది. ఇప్పటికే చిరంజీవితో, పవన్ కల్యాణ్‌లతో సినిమాలు తీసిన బాబీ తర్వాత ఏ మెగా హీరోతో పనిచేస్తారా అని నెటిజన్లు అనుకుంటున్నారు. 'ఆ మెగా హీరో వైష్ణవ్ తేజ్' అని మరికొందరు కామెంట్స్ పెడుతున్నారు. బన్నీకి కూడా ఓ కథ వినిపించినట్లు సమాచారం.

స్వర్ణం కోసం ఐదేళ్లు నిరీక్షణ: సింధు

న్యూదిల్లీ: ప్రపంచ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం కోసం ఐదేళ్లు ఎదురు చూశానని భారత స్టార్ షట్లర్ పీవీ సింధు చెప్పింది. శనివారం ప్రొ వాలీబాల్ లీగ్ ఆరంభానికి అతిథిగా వచ్చిన సందర్భంగా ఆమె మాట్లాడింది. "ప్రపంచ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం చాలా పెద్ద ఘనత. ఒలింపిక్స్ పతకం తర్వాత అంతటి ఆనందం ఈ టోర్నీ గెలవడంతోనే వచ్చింది. ఎందుకంటే ఈ స్వర్ణం కోసం ఐదేళ్లు ఎదురు చూశా. అంతకుముందు రెండు రజతాలు, రెండు కాంస్యాలు గెలిచా. చివరికి 2019లో ప్రపంచ చాంపియన్‌ని అయ్యా" అని సింధు తెలిపింది. 2013, 14 ప్రపంచ చాంపియన్‌షిప్‌లలో కాంస్యాలు నెగ్గిన సింధు.. 2017, 18లో రజతాలు సొంతం చేసుకుంది. 2019 టోర్నీ ఫైనల్లో జపాన్ స్టార్ నవోమి ఒకుహరపై నెగ్గి విజేతగా నిలిచింది.

మద్యం మత్తులో భార్యపై కాంబ్లీ దాడి

ముంబై: టీమిండియా మాజీ క్రికెటర్ వినోద్ కాంబ్లీ చిక్కుల్లో పడ్డాడు. తాజాగా అతడిపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కాంబ్లీ సతీమణి ఆండ్రియా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం గమనార్హం. తనను దుర్భాషలాడటంతోపాటు దాడికి పాల్పడినట్లు కాంబ్లీపై ఆండ్రియా పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ముంబై పోలీసులు కాంబ్లీపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఆండ్రియా తలకు గాయం కావడంతో ఆమెను ఆసుపత్రికి తరలించారు. మద్యం మత్తులో తనపై దాడి చేశాడని కాంబ్లీ భార్య ఫిర్యాదు చేసినట్లు పోలీసు అధికారులు వెల్లడించారు. ఇప్పటి వరకు వినోద్ కాంబ్లీని అదుపులోకి తీసుకోలేదని పేర్కొన్నారు. అయితే, భార్యపై దాడికి పాల్పడిన సంఘటన శుక్రవారం జరిగినట్లు తెలుస్తోంది. ఫిర్యాదులో పేర్కొన్నదానిని బట్టి.. కుకింగ్ పాన్‌ను విసిరి కొట్టడంతో కాంబ్లీ భార్య తలకు దెబ్బ తగలిగిందని అధికారులు వెల్లడించారు. శుక్రవారం మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో మద్యం తాగి వచ్చిన కాంబ్లీ విపరీతంగా దుర్భాషలాడుతూ ఆమెపై దాడి చేసినట్లు తెలిపారు. కాంబ్లీ భార్య ఫిర్యాదు మేరకు వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు పోలీసులు వివరించారు.

ఆసియాకప్ నిర్వహణపై కొనసాగుతున్న సందిగ్ధత

న్యూదిల్లీ: ఆసియా క్రికెట్ కౌన్సిల్ భేటీ జరిగింది. ఏసీసీ చైర్మన్, బీసీసీఐ కార్యదర్శి జైషాతో పాకిస్తాన్ క్రికెట్ బోర్డు చైర్మన్ నజామ్ సేథీ భేటీ అయ్యారు. అయినా ఆసియా కప్-2023 నిర్వహణ ఎక్కడనే దానిపై సందిగ్ధత కొనసాగుతూనే ఉంది. నివేదికల ప్రకారం.. మినీ టోర్నీ పాక్‌లో కాకుండా యూఏఈ వేదికగా నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నారని తెలుస్తోంది. కానీ, మార్చిలోనే ప్రకటిస్తారని సమాచారం. అయితే, జైషాతో నజామ్ సేథీ ఏం మాట్లాడరనేది అధికారికంగా మాత్రం బయటకు రాలేదు. కానీ, అంతర్జాతీయ మీడియా వర్గాల ప్రకారం సేథీ కూడా పట్టు వదలకుండా తమ ఉద్దేశం జైషాతో చెప్పినట్లు పేర్కొన్నాయి. గతంలో ఇదే అభిప్రాయాన్ని నాటి పీసీబీ చైర్మన్ రమీజ్ రజా కూడా చెప్పడం గమనార్హం. "పాక్ వేదికగా ఆసియా కప్‌లో భారత్ పాల్గొనకపోతే.. అక్టోబర్ - నవంబర్‌లో జరిగే వన్డే ప్రపంచకప్‌లో తమ జట్టు కూడా పాల్గొనదు. ఇదే విషయాన్ని జైషా దృష్టికి నజామ్ సేథీ తీసుకెళ్లారు" అని అంతర్జాతీయ, పాక్ మీడియాలో కథనాలు వచ్చాయి. సేథీ తెలిపిన అభిప్రాయానికి జై షా ఆశ్చర్యానికి గురైనట్లు కూడా పేర్కొన్నాయి. నజామ్ నోటి నుంచి ఇలాంటి వ్యాఖ్యలు వస్తాయని జై షా ఊహించలేదని, అందుకే ఆశ్చర్యపోయినట్లు తెలిపాయి. సొంత దేశంలో మాజీల నుంచి వచ్చే విమర్శలను అడ్డుకోవడానికే నజామ్ సేథీ ఇలా మాట్లాడి ఉంటారనే వ్యాఖ్యలూ వినిపిస్తున్నాయి. భారత్ లేకుండా పాక్ వేదికగా జరిగే ఆసియా కప్ వెలవెలబోవడం ఖాయం. ఈ విషయం ఐసీసీ, ఏసీసీతోపాటు పీసీబీకి కూడా తెలుసని.. కాబట్టి బీసీసీఐ కార్యదర్శి ఏ నిర్ణయం తీసుకున్నా అనుసరించాల్సిన పాక్ క్రికెట్ బోర్డుకు నెలకొందని విశ్లేషకులు పేర్కొన్నారు. భారత్-పాక్ మ్యాచ్ అంటే ప్రపంచవ్యాప్తంగా ఆసక్తితోపాటు ఆదరణ ఉంటుంది. ఆదాయం కూడా బాగానే వస్తుంది. మార్చిలో ఐసీసీ, ఏసీసీ ఎగ్జిక్యూటివ్ బోర్డు సమావేశం అనంతరం టోర్నీ వేదిక ఎక్కడనే అంశంపై తుది నిర్ణయం వెలువడుతుంది. యూఏఈ వేదికగానే ఆసియా కప్ నిర్వహించాలని ఏసీసీ తుది నిర్ణయం ప్రకటించినా సరే, ఆర్థికంగా వెనుకబడిన పాక్ ఏమీ చేయలేని పరిస్థితిలో ఉన్నట్లు క్రీడా పండితులు వెల్లడించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.